



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ






| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 301 | ది. 11-2-2026 | బుధవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 301 | Date : 11-2-2026 | Wednesday | Pages : 8 | Rs.1/- |


## అసెంబ్లీ సమావేశాలకు గవర్నర్‌ను ఆహ్వానించిన స్పీకర్



**అమరావతి,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు రేపటి (బుధవారం) నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో.. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం సాయంత్రం గవర్నర్ కార్యాలయంలో భేటీ అయిన స్పీకర్, సంప్రదాయం ప్రకారం గవర్నర్‌ను అసెంబ్లీ సమావేశాలకు ఆహ్వానించారు. ?స్పీకర్ తో పాటు ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర కూడా గవర్నర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా సమావేశాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను వారు గవర్నర్‌కు వివరించారు. రేపు ఉదయం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు.

# రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించండి



- పోలవరం రెండో దశ నిధులు విడుదల చేయండి
- ఉద్యాన ఉత్పత్తుల రవాణాకు 50 శాతం రాయితీకి ఖాళీ రీఫర్ కంటైనర్లు
- ఉత్తర-దక్షిణ భారత్ లను కలుపుతూ ఫ్లైట్ కారిడార్లు నిర్మించాలి
- ఏపీలో మఖానా డెవలప్మెంట్ బోర్డు ఏర్పాటు చేయండి
- పూర్వోదయ సహా, కేంద్ర ప్రాయోజిత పథకాలకు నిధులపై విజ్ఞాపన
- రాష్ట్ర ప్రాజెక్టులు, కేంద్ర నిధులపై సహకారం కోరుతూ సీఎం వినతులు
- హోంమంత్రి అమిత్ షా సహా ఏడుగురు కేంద్ర మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు వరుస భేటీలు

**ఢిల్లీ,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. వీటితో పాటు వివిధ అంశాల్లో రాష్ట్రానికి సహకారం అందించాలని కోరుతూ విజ్ఞాపన పత్రం అందించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి మంగళవారం కేంద్ర హోం మంత్రి సహా ఏడుగురు కేంద్ర మంత్రులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు కేంద్ర మంత్రులతో సీఎం చంద్రబాబు వరుస భేటీలు నిర్వహించారు. అమిత్ షాతో సహా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తో సమావేశమైన సీఎం పూర్వోదయ పథకం ద్వారా రాయలసీమను ఉద్యాన హబ్ గా మార్చే ప్రణాళికకు నిధులు ఇవ్వాలని కోరారు. అలాగే వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాలకు కేంద్ర వాటాను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో భేటీ అయిన ముఖ్యమంత్రి ఏపీలో మఖానా డెవలప్మెంట్







బోర్డు ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. మఖానా సాగుకు ఏపీలో అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని సీఎం స్పష్టం చేశారు. కొల్లేరు ప్రాంతంలో 50వేల ఎకరాల్లో మఖానా సాగు చేసేందుకు ఆస్కారం ఉందని వెల్లడించారు. రాష్ట్రంలో వ్యవసాయం సహా అనుబంధ రంగాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై కేంద్ర వ్యవసాయ మంత్రితో సీఎం చర్చించారు. పీఎం ప్రణామ్ పథకం కింద ఏపీలో సామూహిక సహజ వ్యవసాయాన్ని విస్తరించేందుకు నిధులు విడుదల చేయాలని కేంద్ర వ్యవసాయ మంత్రిని కోరారు. ఈ పథకం కింద గత ఏడాది రసాయన ఎరువుల వాడకం తగ్గించిన రాష్ట్రంగా ఏపీకి రూ.216 కోట్ల మేర ప్రోత్సాహకాలను మంజూరు చేయాలని అడిగారు. ఏపీలో కొబ్బరి సాగు చేసేందుకు రూ. 200 కోట్ల మేర సాయం అందించాలని కూడా సీఎం కోరారు. కోకోనట్ ప్రాసెసింగ్ పార్కు ఏర్పాటు , కర్ణాటక తరహాలో ఆధునిక టెండర్ కోకోనట్ మార్కెట్ల ఏర్పాటు, కొబ్బరి రైతులకు అధునాతన పద్ధతులపై శిక్షణ, నర్సరీల విస్తరణకు సహకారం అందించాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. వన్ డ్రాప్ మోర్ క్రాప్ పథకం కింద పెండింగ్ లో ఉన్న రూ.695 కోట్లను విడుదల చేయాలని విజ్ఞాపన పత్రం అందించారు. ప్రైస్ డెఫిషియన్సీ పేమెంట్ సిస్టం కింద 2025-26 సీజన్ లో తోతాపురి మామిడి రైతులకు కేంద్ర వాటాగా ఇవ్వాల్సిన రూ.100 కోట్లను విడుదల చేయాలని సీఎం కోరారు.

**పోలవరం రెండో దశకు రూ.32 వేల కోట్లు అవసరం..** పోలవరం ప్రాజెక్టు రెండో దశలో భాగంగా తదుపరి భూసేకరణ, పునరావాసానికి నిధులు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ కు విజ్ఞప్తి చేశారు. దీని కోసం రూ.32 వేల కోట్లు అవసరం అవుతాయని తెలిపారు. ఏపీలోని వివిధ సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు, ఆర్థిక సాయం అందించాలని కోరారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి స్టాప్ వర్క్ ఆర్డర్ శాశ్వతంగా ఎత్తివేసేలా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర మంత్రిని కోరారు. పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువల సామర్థ్యం పెంపు కారణంగా పెరిగిన వ్యయాన్ని రీయింబర్సు చేయాలని విజ్ఞాపన పత్రం అందించారు. గోదావరి వరద జలాలను వర్షాభావ ప్రాంతాలకు తరలించే లక్ష్యంతో పోలవరం--నల్లమల సాగర్ లింక్ ప్రతిపాదనలకు ఆమోదం తెలియచేయాలని అభ్యర్థించారు. జాతీయ నదుల అనుసంధాన విధానంలో భాగంగా ఈ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేసి, సాంకేతిక--ఆర్థిక సాయం ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్-ఒడిశా మధ్య వంశధార నీటి వివాదాన్ని పరిష్కరించేలా వంశధార నీటి వివాద ట్రిబ్యునల్ (వీడబ్ల్యుడీటీ) తుది నివేదిక గెజెట్‌లో ప్రచురించాలన్నారు. గోదావరి జలాల పంపకంపై ఏపీ-తెలంగాణ మధ్య వివాదం కొనసాగుతోందని నదీ జలాల పంపకం కోసం గోదావరి నీటి వివాదాల ట్రిబ్యునల్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. ఎగువ కృష్ణాపై ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపునకు కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన చర్యలపై సీఎం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తును పెంచడం వల్ల ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే దిగువ ప్రవాహ జలాలపై తీవ్ర ప్రభావం ఉంటుందని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి పాటిల్ కు వివరించారు.

## విశాఖ వాసులకు గుడ్ న్యూస్.. మెట్రో రైలు ప్రాజెక్టుకు పచ్చజెండా

- విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం
- సీఎం చంద్రబాబుతో భేటీలో స్పష్టం చేసిన కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి భారీ శుభవార్త అందింది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టుకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం చంద్రబాబుకు ఈ మేరకు ఈ సానుకూల స్పందన లభించడం గమనార్హం. సోమవారం రాత్రి ఢిల్లీకి చేరుకున్న సీఎం చంద్రబాబు, ఇవాళ పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు. ఈ క్రమంలోనే కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విశాఖ మెట్రో ప్రాజెక్టుకు అనుమతి ఇస్తున్నట్లు ఖట్టర్ స్వయంగా చంద్రబాబుకు తెలిపినట్లు సమాచారం. ఈ నిర్ణయంతో విశాఖ మెట్రో ఏర్పాటులో కీలక ముందడుగు పడినట్లయింది. విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెట్రో రైల్ ప్రాజెక్టులను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు కూడా పంపింది.

**గౌరవ మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు (Senior Division) విజయవాడ**

ఓ.ఎస్.నెం.277/2024

మధ్య:

కోనేరు ప్రసాద్ ----దావాదారు

మరియు

కోనేరు నాగేశ్వరరావు

మరియు ఇతరులు

----ప్రతివాదులు

Notice

To

కోనేరు నాగేశ్వరరావు

ప్రతివాది నెం.1

తండ్రి స్వర్గీయ నాగభూషణం, హిందువు, వయస్సు సుమారు 69 సంవత్సరాలు,

వృత్తి : బిజినెస్, డోర్ నెం.28-1-90/4,

5వ రోడ్, శాంతినగర్,

ఏలూరు - 534001, ఏలూరు

మొబైల్ నెం : 9885183672

పై దావా ఈ గౌరవనీయ న్యాయస్థానంలో ఉన్నందున సదరు న్యాయస్థానం ద్వారా పంపుతుండగా అవి అందకపోవడం వలన పత్రికా ప్రకటన ద్వారా ప్రత్యామ్నాయ నోటీసు జారీ చేయమని గౌరవనీయ న్యాయస్థానం ఆదేశించింది. కావున మీరు 24-02-2026న 10.30 గంటలకు స్వయంగా గానీ లేదా మీ న్యాయవాది ద్వారాగానీ ఈ కోర్టులో హాజరుకావలసినదిగా తెలియజేయబడుచున్నది. లేని యెడల మీ పరోక్షమున దావా ఎక్స్‌పార్టీగా విచారించబడును.

**(గౌరవనీయ న్యాయస్థానం ఆదేశాల మేరకు)**

ఇట్లు

**బి.వి.సతీష్**

**జి.రవీంద్రప్రసాద్**

న్యాయవాదులు

డి.నెం.40-7-28, 1వ లైన్,

గోఖరాజు వీధి, విజయవాడ-520010

విజయవాడ

తేది : 07-02-2026

**మహారాజ శ్రీ 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) విజయవాడ**

OS.No.1122/2024

Between :

M/s Vijayalakshmi Steels, Bhavanipuram, Vijayawada

Rep by its mg partner

--------Plaintiff

And

Mr. N.F.Syed Abid, Prop : New Danka Steels

S/o Fakruddin, R/o 17-2-67, Parigi road, Hindpur - 515201, Anantapur Dist

--------Defendant

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీరు ఎన్ని పర్యాయములు శ్రీ కోర్టు వారు పంపిన సమన్‌లను తీసుకొనక కాలయాపన చేయుచుండుట వలన శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం పేపర్ ప్రచురణ ద్వారా ది.26-02-2026వ తేదిన ఉదయం 10.30ని॥లకు పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షముగా తీర్మానించెదరు.

**(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)**

**వాయిదా తేది : 26-02-2026**

ఇట్లు

**D.P.Ramakrishna**

**D.Prudhvi**

Advocates

Vijayawada

# ఉద్యోగుల ఉసురు పోసుకోకు..

## -డీఏ, పీఆర్సీపై రేవంత్ రెడ్డికి బండి సంజయ్ లేఖ



**హైదరాబాద్,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ డీఏలు, పీఆర్సీ బకాయిలు, రిటైర్మెంట్ ప్రయోజనాలను తక్షణమే చెల్లించాలని మంగళవారం కేంద్ర మంత్రి బండి సంజయ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో 3 లక్షలకు పైగా రెగ్యులర్, 4 లక్షలకు పైగా రిటైర్డ్ ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగులు దాచుకున్న గ్రాట్యుటీ, ఈపీఎఫ్, లీవ్ ఎన్?క్యాష్?మెంట్ బకాయిలను కూడా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించడం లేదని, 2023 జులై నుండి అమలు చేయాల్సిన పీఆర్సీని రెండున్నరేళ్లు అవుతున్నా ఆ ఊసే ఎత్తకపోవడం శోచనీయం అన్నారు. కనీసం పీఆర్సీ రిపోర్ట్ ను కూడా తెప్పించకపోవడం చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యోగులంటే ఎంతటి నిర్లక్ష్య వైఖరి ఉందో అర్థం చేసుకోవచ్చని దుయ్యబట్టారు.

**మీ నిర్లక్ష్యానికి 61 మంది మృతి..** రిటైర్డ్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వమే మానసిక వేదనకు గురిచేస్తుండటం క్షమించరానిదన్నారు. ముక్కు మొఖం తెలియని వృద్ధులు కష్టాల్లో ఉంటేనే చేతనైనంత సాయం చేయాలని భావించే గొప్ప మానవతా హృదయమున్న తెలంగాణ సమాజం మనది. అలాంటిది జీవితాంతం ప్రభుత్వానికి ఊడిగం చేసిన ఉద్యోగులు రిటైర్డ్ అయితే వారి బెన్?ఫిట్స్ అన్నీ చెల్లించి సగౌరవంగా సన్మానించి పంపాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ వారి ఉసురు పోసుకుంటోందని విమర్శించారు. మానవత్వం ఉన్న పాలకులెవరూ ఇంతటి నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శించరని, మీ నిర్లక్ష్యం వల్ల బెన్‌ఫిట్స్ అందక గత ఏడాది నుండి ఇప్పటి వరకు 61 మంది రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర మానసిక వేదనకు లోనై మరణించారని ఆరోపించారు.

**మున్సిపల్ ఎన్నికల తర్వాత కార్యాచరణ ఇదే"..** రిటైర్డ్ ఉద్యోగులతోపాటు ఉద్యోగ, ఉపాధ్యాయలకు చెల్లించాల్సిన బకాయిలన్నీ కలిపితే రూ.12 వేల కోట్లకుపైగా ఉన్నట్లు తెలుస్తోంది. ఏటా రూ.2.5 కోట్లకు పైగా వార్షిక బడ్జెట్ కలిగిన రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు రూ.12వేల కోట్ల బకాయిలు చెల్లించడం భారంగా భావించడం అంటే అంతకంటే దురదృష్టకరమైన విషయం మరొకటి లేదన్నారు. ఇకనైనా వారిపట్ల మీకున్న నిర్లక్ష్య ధోరణిని విడనాడి రిటైర్డ్ ఉద్యోగుల బెన్‌ఫిట్స్ బకాయిలను అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకుని యుద్ధ ప్రాతిపదికన చెల్లించాలని డిమాండ్ చేశారు.

**ప్రకటన**

నా క్లయింటు కృష్ణాజిల్లా, విజయవాడ ఏరియా, కృష్ణలంక, వచ్చమేడ బజారు, డోరు నెం.41-20/2-42 కాపురస్తురాలు చల్లా రాజశేఖర్ గారి భార్య చల్లా శ్రీలక్ష్మి గారి వల్ల సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునదేమనగా నా క్లయింటు వారి యింటి వద్ద (కృష్ణలంక) నుండి కోర్టుకు వెళ్ళు మార్గ మధ్యంలో ది.27-01-2026వ తేదీన తన బ్యాగు పోగొట్టుకొనినారు. ఆ బ్యాగులో నా క్లయింటు అమ్మమ్మ మారేవల్లి వెంకటలక్ష్మి గారు ది.12-2-2009వ తేదీన పటమటలో సబ్‌రిజిస్ట్రారు ఆఫీసులో నెం.24 ఆఫ్ బికె3/2009రుగా రిజిష్టరు కాబడిన ఒరిజినల్ వీలునామా ఉన్నది. కావున సదరు పైన తెలిపిన దస్తావేజు ఎవరికైననూ దొరికిన యెడల ఈ దిగువ తెలిపిన చిరునామాకు స్వయంగాగాని, రిజిష్టరు పోస్టు ద్వారా గానీ 10 రోజులలోవుగా పంపగలరు. మరియు పైన తెలిపిన డాక్యుమెంటుపై ఎటువంటి లావాదేవీలు క్రయవిక్రయములు చట్టప్రకారము చెల్లనేరవని యిందు మూలంగా తెలియజేయడమైనది.

ఇట్లు

బి.రామకృష్ణ, హైకోర్టు న్యాయవాది

డిఆర్‌డబ్ల్యుఎ-301, 2వ క్రాస్, 1వ లైన్,

దేవీనగర్, విజయవాడ-520003. సెల్:9949264130

## ఏపీకి మరో వందేభారత్... కేంద్రాన్ని కోరిన సీఎం చంద్రబాబు

- ఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం చంద్రబాబు భేటీ

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో మంగళవారం సమావేశమయ్యారు. రాష్ట్రంలో రైల్వే వ్యవస్థను సమూలంగా బలోపేతం చేసే లక్ష్యంతో పలు కీలక ప్రాజెక్టులు, కొత్త సర్వీసులు, మౌలిక వసతుల కల్పనపై ఆయనతో చర్చించారు. ఈ మేరకు సమగ్రమైన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. విజయవాడ-బెంగళూరు మధ్య తిరుపతి మీదుగా వెళ్లేలా వందేభారత్ రైలును కేటాయించాలని కోరారు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, చెన్నై-బెంగళూరు హైస్పీడ్ రైల్ కారిడార్లను ఏపీని తాకుతూ ప్రకటించడంపై చంద్రబాబు కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. ఇదే సమయంలో, బెంగళూరు-చెన్నై హైస్పీడ్ రైలు మార్గాన్ని ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన తిరుపతికి అనుసంధానం చేయాలని ప్రత్యేకంగా కోరారు. విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేసిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలను వచ్చే ఏప్రిల్ 1వ తేదీ నుంచే ప్రారంభించేలా తక్షణమే గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

## భ్రమ కల్పించేందుకే ఈ అబద్ధపు ప్రచారం: జగన్

- చంద్రబాబు ప్రభుత్వం జీఎస్‌డీపీపై తప్పుడు లెక్కలు చెబుతోందని జగన్ ఆరోపణ
- 11.75 శాతం వృద్ధి అంటూ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని విమర్శ
- 'కాగ్' లెక్కల ప్రకారం రాష్ట్ర పన్నుల రాబడి వృద్ధి కేవలం 1.97 శాతం మాత్రమేనని వెల్లడి



**తాడేపల్లి, ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** వైసీపీ అధినేత జగన్ కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం మాత్రం తప్పుడు జీఎస్‌డీపీ (స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి) గణాంకాలతో ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందనే భ్రమ కల్పించేందుకే ఈ అబద్ధపు ప్రచారం చేస్తున్నారని జగన్ దుయ్యబట్టారు. ప్రభుత్వం విడుదల చేసిన వివరాల ప్రకారం, 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 11.75 శాతం వృద్ధి సాధించిందని, 2025-26లో ఇది 10.75 శాతంగా ఉంటుందని అంచనా వేస్తున్నట్లు పేర్కొనడాన్ని జగన్ తప్పుబట్టారు. ఈ వృద్ధి రేటుతో దేశంలోనే మూడో స్థానంలో ఉన్నామని ప్రభుత్వం చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. ఈ లెక్కలు ఏ స్వతంత్ర సంస్థ ఇచ్చినవి కావని, కేవలం చంద్రబాబు కార్యాలయంలో సృష్టించినవని ఆయన విమర్శించారు. ప్రభుత్వం చెబుతున్న వృద్ధి నిజమైతే, పన్నుల రాబడిలో కూడా అదే స్థాయి పెరుగుదల కనిపించాలని జగన్ అన్నారు. కానీ, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 9 నెలలకు విడుదల చేసిన లెక్కలు ప్రభుత్వ బూటకపు ప్రచారాన్ని బట్టబయలు చేశాయని తెలిపారు. గత రెండేళ్లలో రాష్ట్ర పన్నుల రాబడి వృద్ధి సగటున కేవలం 1.97 శాతంగా మాత్రమే ఉందని, ఇది దిగ్భ్రాంతికరమని అన్నారు. "11 శాతం పైగా జీఎస్‌డీపీ వృద్ధి సాధిస్తున్న రాష్ట్రంలో పన్నుల రాబడి 2 శాతం లోపు ఎలా ఉంటుంది? ఈ వింత గణాంకాలు చూసి ప్రపంచ ఆర్థికవేత్తలు కూడా ఆశ్చర్యపోతారు" అని జగన్ ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో, దేశంలోని 23 రాష్ట్రాలకు సంబంధించిన పన్నుల రాబడి వృద్ధిపై 'కాగ్' విడుదల చేసిన గణాంకాలను జగన్ ప్రస్తావించారు.

# ఈ-సైకిళ్ళు పంపిణీ చేసిన శాసనసభ్యులు కృష్ణప్రసాద్





**పెడన,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** మహిళా సాధికారత లక్ష్యంగా స్వయం సహాయక బృందం సభ్యులు, గ్రామ సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు అంగన్‌వాడీ టీచర్లకు, మన ఆరోగ్య రక్షణ కు, పర్యావరణ పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సబ్సిడీ తో ఈ –సైకిళ్లను ప్రభుత్వం అందజేస్తుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. వెలుగు పథకం ద్వారా పెడన నియోజకవర్గంలోని 4 మండలాల్లో 24మందికి బ్యాటరీ సైకిల్స్ ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అందజేశారు గ్రీన్ & హెల్తీ " కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాజెక్ట్, స్థిరమైన రవాణాను ప్రోత్సహించడం మరియు ప్రయాణ ఖర్చులను తగ్గించడం లక్ష్యంగా అందజేయడం జరుగుతుందని కాగిత అన్నారు. సరఫరా చేయబడిన ఈ–సైకిళ్లు రోజువారీ ప్రయాణానికి అనుకూలంగా రూపొందించబడ్డాయి, వీటిలో రీఛార్జబుల్ బ్యాటరీలు, పెడల్–అసిస్ట్ మోడ్‌లు మరియు మెకానికల్ డిస్క్ బ్రేక్‌లు ఉన్నాయి. ఎలక్ట్రిక్ సైకిళ్ల విలువ సుమారు ?35,000, సబ్సిడీ 11,000. ద్వారా లబ్ధిదారులకు అందజేస్తున్నారని కృష్ణప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గున్నారు..

# కుక్కల దాడికి విలేకరి కి గాయాలు



**విస్సన్నపేట,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో వార్త సేకరణలో చురుకైన పాత్ర వహించే జాతీయ మీడియా రిపోర్టర్ విధి నిర్వహణలో బైక్ పై వెళ్లే సమయంలో కుక్కలు దాడి చేయడంతో స్వల్ప గాయాలయ్యాయి. గతంలో ఆ విలేఖరి పలుమార్లు కుక్కలు, కోతులు ఎక్కువగా ఉన్నాయని వాటిని నివారించాలని ప్రజల కోరుతున్నారని పలుమార్లు వార్తా సమాచారం అందించటం జరిగింది.

# వాసిరెడ్డి శంకర భవాని కి నివాళులు అర్పించిన శ్రీ రామ్ చిన్న బాబు



**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండల అయ్యప్ప స్వామి సేవా సమితి అధ్యక్షులు, తిరుపతమ్మ ఆలయ మాజీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ మండలంనాయకులు వాసిరెడ్డి బేనర్జీ సతీమణి వాసిరెడ్డి శంకర భవాని గత ఐదు రోజులు క్రితం అనారోగ్యం తో మృతి చెందగా ఆరోజు తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీ రామ్ చిన్న బాబు అందుబాటులో లేక పోవడం తో మంగళవారం వాసిరెడ్డి వారి నివాసానికి వచ్చి వాసిరెడ్డి శంకర భవాని చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లులు అర్పించి, వారి కుటుంబానికి సంతాపం తెలియ జేశారు. ఇలాంటి సమయంలో అధైర్య పడకుండా ధైర్యంగా గా వుండాలని బేనర్జీ కి ఆయన కుమారుడు వాసిరెడ్డి బాలు కు సూచించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఉమ్మినేని పుల్లయ్య బాబు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రేపాల మోహన రావు, జనసేన పార్టీ నాయకులు నల్లపునేని వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు..

# తుమ్మలపల్లి ని సన్మానించిన మండల కూటమి నాయకులు



**కంకిపాడు / పెనమలూరు,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** ఎమ్మెల్యే బోడే ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. పెనమలూరు నియోజకవర్గం, కంకిపాడు మండలం, కంకేవాడు పట్టణంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, డాక్యుమెంట్ రైటర్ తుమ్మలపల్లి హరికృష్ణకు టిడిపి కృష్ణా జిల్లా అధికారి ప్రతినిధిగా, బత్తుల కామేశ్వరరావుకి, నెరుసు రాజ్యలక్ష్మి కి జిల్లాస్థాయి పదవులు రావడంతో, హరికృష్ణ కార్యాలయంలో టిడిపి సీనియర్ నాయకులు జరుగు శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ ఎంపీపీ దేవినేని రాజా తుమ్మలపల్లి హరికృష్ణని, బత్తుల కామేశ్వరరావును శాలువాతో సన్మానించి, పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు సమన్వయ పరుచుకుంటూ నియోజకవర్గంలో తెలుగుదేశం జెండా ఎగిరే విధంగా నాయకులు కార్యకర్తలు పని చేయాలని సూచించారు. అనంతరం నియోజకవర్గం మహిళ కార్యకర్తలు, నాయకులు, కార్యకర్తలు వారిని సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# తిరుపతి లడ్డూ పై విష ప్రచారం చేస్తున్న కూటమి నాయకులు

## –మాజీ ఎమ్మెల్యే డా: మొండితోక జగన్మోహనరావు



**నందిగామ,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** తిరుపతి లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యిలో కల్తీ జరగలేదని,అందులో జంతువుల కొవ్వు కలవలేదని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సీబీఐ సీట్ స్పష్టంగా నివేదిక ఇచ్చిందని వైసిపి నాయకులు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్రావు అన్నారు. మంగళవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో తిరుమల లడ్డు కల్తీ జరిగిందని విష ప్రచారం చేస్తున్న దేశం పార్టీల నాయకుల తీరును సమావేశంలో జగన్మోహన్రావు తీవ్రంగా ఖండించారు.నెయ్యిలో జంతువుల కొవ్వు, పందికొవ్వు లేవని సీట్ నివేదిక ఇచ్చినట్లు ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.2024 జూన్, జూలై నెలల్లో టీటీడీకి వచ్చిన ట్యాంకర్లలో నెయ్యి నాణ్యత పై పరీక్షలు జరగ్గా అవన్నీ నాణ్యత పరీక్షల్లో పాసయ్యాయి.తరువాత జూలై 2 నా వచ్చిన రెండు ట్యాంకర్లు, జూలై 12 నా వచ్చిన రెండు ట్యాంకర్లలో నెయ్యి నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేదని వెనక్కి పంపించారు. తిరస్కరించిన టాంకర్ లనే మళ్లీ తిరిగి టీటీడీకి పంపించి అదే నెయ్యి ని ఉపయోగించారు.చివరకు లడ్డు తయారీలో బాత్రూం క్లీనర్స్, లాప్సా వంటి రసాయనాలు ఉపయోగించారని ఆరోపించటం తెలియని ధనమన్నారు.ఇకనైనా కూటమి ప్రభుత్వం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ముందు తమ తప్పును ఒప్పుకొని... క్షమాపణ చెప్పాలని జగన్మోహన్రావు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయం కోసం దేవుని వాడుకుంటున్నారు



**తిరువూరు,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** ప్రజాసమస్యల్ని పక్కదారి పట్టించేందుకు కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌రలేపిందన్న–తిరువూరు నియోజకవర్గ ఇన్చార్జ్ నల్లగట్ల స్వామిదాస్..శ్రీవారి లడ్డు ప్రసాదం వ్యవహారంలో నిప్పులాంటి నిజాన్ని ప్రక్కదారి పట్టించారు. 2024 అధికారం చేపట్టాకే కల్తీ నెయ్యి,ట్యాంకర్ల విషయం బయటకు వచ్చింది.రిజెక్ట్ చేసిన నాలుగు ట్యాంకర్లు తిరిగి దొడ్డిదారిన తెప్పించిన విషయం సీబీఐ చార్జిషీట్లో పేర్కొంది. శ్రీవారి లడ్డు ప్రసాదంలో జంతు కొవ్వులు కలిసిందని దుష్ప్రచారం చేశారు. ఎన్డిడిబి,ఎన్డిఆర్ఐ లాంటి ల్యాబ్ లే "నో యానిమల్ ఫ్యాట్ అంటూ సిబిఐ సిట్ లో స్పష్టంగా పేర్కొంది.హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా తమస్వార్ధ రాజకీయాల కోసం చంద్రబాబు, పవన్ కల్యాణ్ మాట్లాడారు.ఇప్పుడు మరోమాట మార్చి కెమికల్స్ కలిపారంటూ దుష్ప్రచారం చేస్తున్నారు. మీ ప్రభుత్వం వచ్చాకే,మీపాలకమండలిలోనే జరిగిన అంశం.. సమస్యల్ని పక్కదారి పట్టించేందుకే కూటమి పెద్దలు ఇదంతా చేస్తున్నారు.తిరువూరు మీ టీడీపీ ఎమ్మెల్యేనే మీ పాలన గురించి బ్రహ్మాండంగా చెప్పారు.ఊళ్లో రోడ్లు లేవని, యువతకు ఉద్యోగాలు లేవని, పల్లెలు కన్నీరు పెడుతున్నాయని స్టేటస్ లు పెట్టారు.. తిరువూరులో పరిస్థితులు ఎంత అధ్వానంగా ఉన్నాయో.. కట్టలేరు బ్రిడ్జి, ఎంఎన్కె రోడ్డు, ఎత్తిపోతల పథకాలకు దిక్కు లేదన్నారు. ఇప్పటికైనా మీ దుష్ట రాజకీయాలు పక్కనపెట్టి రాష్ట్రాభివృద్ధిపై దృష్టి పెట్టండి. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలు చేయాలి.ప్రజల పక్షాన నిలబడతానని బాండు పేపర్ పై చంద్రబాబుతో కలిసి సంతకం పెట్టిన పవన్ కళ్యాణ్ ప్రజలను మోసం చేశారు. దేవుని రాజకీయాలకు వాడుకోవద్దని.. దైవ ప్రసాదాన్ని అభాసుపాలు చెయ్యొద్దన్నారు.పేదరికంలో ప్రజల మగ్గుతున్నారని వైయస్ జగన్ సంక్షేమ పథకాలు అమలు కావడం లేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమాన్ని పక్కన పెట్టి 3 క్షల కోట్లకు పైగా అప్పులు చేశారని మండిపడ్డారు.రేపు జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో తెచ్చిన లక్షల కోట్ల అప్పులకు లెక్క చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వానికి హెచ్చరిక చేస్తున్నానని దేవుడితో పెట్టుకుని మీ పతనాన్ని మీరే కోరుకుంటున్నారు.

# రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి: కలెక్టరు ఆర్.మహేష్




**అమలాపురం,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** జొన్నాడ ఫ్లైఓవర్ వద్ద సర్వీస్ రోడ్లు నిర్మాణ పనులను ఈనెల 15 ప్రారంభించి మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ప్రాజెక్టు కాంట్రాక్టర్ రామ కృష్ణను ఆదేశించారు. మంగళవారం స్థాని కలెక్టరేట్ నందు ఆర్డీవోలు జాతీయ రహదారుల అధికారులు,రెవెన్యూ అధికారులు,జొన్నాడ ఫ్లైఓవర్ గుత్తేదారులతో సమావేశం నిర్వహించి 216ఇ భూ సేకరణ స్థితిగతులు డిపిఆర్లు రూపకల్పన జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణ పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు సంబంధించి ఫ్లైయాష్ తో వంతెన ఇరువైపులా నింపే ప్రక్రియ సర్వీస్ రోడ్డు నిర్మాణాలు ఇతర నిర్మాణ పనులకు సంబంధించి టైం లైన్ గడువులను విధిం చారు. ఈ ప్రకారం వర్కులు జరగాలని గుత్తేదారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఇప్పటికే ఫ్లైఓవర్ నిర్మాణ పనులలో ఎంతో జాప్యం జరిగిందని ఇకపై జాప్యాలకు తావు లేకుండా టైం లైన్ ప్రకారం నిర్మాణ పనులు పూర్తి నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని ఆదేశించారు. 216 ఇ రావులపాలెం నుండి అమలాపురం వరకు బైపాస్ నిర్మాణం కు సంబంధించి భూ సేకరణ స్థితిగతులను ఆయన రెవెన్యూ సిబ్బంది జాతీయ రహదారుల ఇంజనీర్లతో సమీక్షించారు. మినిస్ట్రీ ఆఫ్ రోడ్డు రవాణా జాతీయ రహదారులు విభాగం వారు రూపొందించిన డిపిఆర్ స్థితిగతులపై ఆయన ఇంజనీర్లతో సమీక్షించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు కే మాధవి, పి. శ్రీకర్, తహశీల్దార్లు చినబాబు, దివాకర్,రాంబాబు జాతీయ రహదారుల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నిక్కీ క్రాస్ తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ నగరంలో వర్తక వ్యాపార సంస్థల నుండి భారీగా వసూలు చేస్తున్న లైసెన్స్ ఫీజులు తగ్గించాలి - సిపిఎం డిమాండ్

## ● ఎంపీలు, ఎమ్మెల్యేలు నగర పాలక సంస్థకు నిధులు రాబట్టాలని విజ్ఞప్తి

**కాకినాడ, ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** కాకినాడ నగర పాలక సంస్థ పరిధిలో వర్తక వ్యాపార సంస్థల నుండి భారీగా వసూలు చేస్తున్న లైసెన్స్ ఫీజులు తగ్గించాలని సిపిఎం కాకినాడ నగర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నెలలో పట్టణాలు, గ్రామాల్లో కూడా స్థానిక సంస్థల ద్వారా వర్తక వ్యాపార సంస్థల నుండి లైసెన్స్ ఫీజులు వసూలు చేయడం జరుగుతుందన్నారు. అయితే కాకినాడ నగరంలో ఆదాయాన్ని సమకూర్చుకునే పేరుతో ఈ సంవత్సరం లైసెన్స్ ఫీజులు రెట్టింపు చేసి వసూలు చేయడం జరుగుతుందన్నారు. కొన్ని సంస్థల నుండి 4 నుండి 6 రెట్లు కూడా వసూలు చేయడం సమంజసంగా లేదన్నారు. నగరంలో కొన్ని రకాల వ్యాపారులు టర్నోవర్ లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో రెట్టింపు లైసెన్స్ ఫీజులు వసూలు చేయడం తగదన్నారు. అదేవిధంగా ఆస్తి పన్నులు పెంచడం వల్ల, ఇంటి అద్దెలు కూడా పెరిగి పోతున్నాయన్నారు.

గత 3 సంవత్సరాలు గా కాకుండా నగరం లో పాలకవర్గం లేకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయని తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నిధులు కాకినాడ నగర పాలక సంస్థకు రాబట్టడానికి స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ప్రస్తుతం భారీగా వసూలు చేస్తున్న లైసెన్స్ ఫీజులు తగ్గించాలని సిపిఎం డిమాండ్ చేస్తోందని వీరబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

# కంచి కామకోటి విద్యాసంస్థల్లో ప్రవేశాలకు ఆహ్వానం..

## –చీఫ్ కోఆర్డినేటర్ మాంధాత మాధవి వెల్లడి



**కాకినాడ,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** సన్నాతన ధర్మం కాపాడుకోవడం కోసం విద్యార్థిని విద్యార్థులకు నూతన విద్యా విధానం ద్వారా కంచి కామకోటి విద్యాలయాలు ఎప్పుడూ ముందుంటాయని ఆ విద్యాలయాల చీఫ్ కోఆర్డినేటర్ మాంధాత మాధవి తెలిపారు. మంగళవారం ఉదయం స్థానిక జయేంద్ర నగర్ వినాయకుని ఆలయంలో ఆమె మాట్లాడుతూ, ఉపనయనం అయిన బ్రాహ్మణులకు విద్యా వేదము వైద్యము తో పాటు ఇంగ్లీషు, స్మార్తము, ఆగమనము, వేదము మరియు సంగీతము, రామాయణం వంటి సబ్జెక్టులలో ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. అలాగే నాయి బ్రాహ్మణులకు నాదస్వరం లోను మంత్రసాని, నర్సింగు వంటి సబ్జెక్టులు యాదవులకు గోవిజ్ఞానంలోనూ కుమ్మరులకు కుంభాకార విద్య,విశ్వబ్రాహ్మణులకు తక్షవిద్య వంటి కులవృత్తులతోపాటు ఆంగ్ల విద్య కూడా బోధిస్తామని తెలిపారు. అలాగే బ్రాహ్మణ ఆడపిల్లలకు సాంప్రదాయ విద్య, మడి ఆచారం వంటి వ్యవహారాలు,ఇంగ్లీషు నేర్పిస్తామని మాధవి తెలిపారు.ఈ విద్యా సంస్థలు తిరుపతిలో ప్రారంభమై దేశవ్యాప్తంగా 10 బ్రాంచ్ లు కలిగి ఉన్నాయన్నారు. ఈనెల 21న స్థానిక సూర్యకాంతంలో ఉదయం 9 గంటల నుండి పై విద్యలకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు కంచి చంద్రశేఖర సరస్వతి మహా విశ్వవిద్యాలయం కాంచీపురంలో ఇంజనీరింగ్, ఆర్ట్స్, సైన్స్, పారామెడికల్, ఆయుర్వేదము, లా, నర్సింగు వంటి కోర్సులకు 2026 27 సంవత్సరం గాను స్త్రీలనుండి దరఖాస్తు స్వీకరిస్తామన్నారు. వారికి వచ్చిన మార్కులు బట్టి స్కాలర్షిప్ సదుపాయం కూడా కలదని తెలిపారు. అలాగే తమ విద్యాసంస్థలలో వార్డెన్లు వంటవారు ఉద్యోగాలు ఉన్నాయని ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని మాధవి తెలిపారు ఈ కార్యక్రమంలో ఆకలి మురళీకృష్ణ మాంధాత సూర్యారావు మాంధాత స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట.. ఎమ్మెల్యే కాగిత....



**కృత్తివెన్ను,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** బంటిమిల్లి మండలం అర్థమూరు గ్రామంలో జై భారత్ రైతు ఉత్పత్తిదారుల సంఘం వారు ఏర్పాటు చేసిన రైతు సదస్సు కార్యక్రమంలో పాల్గొన్న పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ..ప్రకృతి వ్యవసాయం అంటే పంటను పెంచడమే కాదు –ప్రకృతిని బలపరచడంఅని రైతులకు పంటల మార్పిడి (క్రాప్ రోటేషన్) నేలను బలపరచి రైతుకు లాభం తీసుకస్తుంది అని తెలియజేసారు రసాయనాలకు ఖర్చు పెట్టినదానికన్నా – ప్రకృతి వ్యవసాయంలో పెట్టుబడి తక్కువ – భూమికి రైతుకు శాశ్వత లాభాలు వస్తాయి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల శ్రేయస్సు కొరకు వ్యవసాయ శాఖ లో భాగమైన ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ, రైతుల శ్రేయస్సు కొరకు ప్రకృతి వ్యవసాయ విధానాన్ని ప్రవేశపెట్టిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందని పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు.. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు అధికారులు గ్రామస్తులు రైతులు తదితరులు పాల్గొన్నారు...

# మైలవరంలో ఘనంగా చనమోలు వెంకట్రావు జయంతి వేడుకలు





**మైలవరం,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మాజీ మంత్రి దివంగత నేత చనమోలు వెంకట్రావు 94వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.మైలవరం పట్టణంలో చనమోలు వెంకట్రావు విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించా రు.అనంతరం వారు మాట్లాడుతూ చనమోలు వెంకట్రావు మైలవరం నియోజకవర్గం నుంచి 5 సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసి మైలవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపార న్నారు.ఇప్పటికి మైలవరం నియోజకవర్గ అభివృద్ధి అంటే చనమోలు వెంకట్రావు గుర్తుకు వస్తారని అన్నారు.ఏపి,మైలవరం నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే సాధ్యం అవుతుందని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు బ్లాక్–1 అధ్యక్షులు దోసపాటి గిరిధర్ కుమార్, మైలవరం మండల పార్టీ అధ్యక్షుడు పిట్టల నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు అన్నవరపు దుర్గారావు, మైలవరం నియోజక వర్గ బిసి సెల్ అధ్యక్షులు మసనం సుధాకర్,జిల్లా ఉపాధ్యక్షులు శీలం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుండి 'స్మార్టు మీటర్స్ పఖ్వాడా



**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** ఆంధ్ర ప్రదేశ్ ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఏపీ ఈపీడీసీ ఎల్) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ సర్కిల్ ఆధ్వర్యంలో, భారత ప్రభుత్వం విద్యుత్ మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల మేరకు ఈనెల 9 నుండి 23వ తేదీ వరకు స్మార్టు మీటర్స్ పఖ్వాడా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు విద్యుత్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బి. రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు ఆధునిక సాంకేతిక సేవలు అందించడం, విద్యుత్ వినియోగంపై అవగాహన పెంపొందించడం ప్రీపెయిడ్ స్మార్టు మీటర్ల వినియోగాన్ని ప్రోత్సహి ంచడంఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. స్మార్టు మీటర్ల ద్వారా వినియోగదారులు ముందస్తుగా విద్యుత్ చెల్లింపులు చేసుకునే సౌకర్యం, రియల్ టైమ్‌లో విద్యుత్ వినియోగ వివరాలు తెలుసుకునే అవకాశం, ఖచ్చితమైన బిల్లింగ్ విధానం ఉంటుందన్నారు. తక్కువ బ్యాలెన్స్ మరియు అసాధారణ వినియోగంపై హెచ్చరికలు పొందే సదుపాయం కూడా లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే మొబైల్ యాప్ ద్వారా వినియోగ వివరాలు తెలుసుకోవడం, రీఛార్జి సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుందని తెలిపారు. స్మార్టు మీటర్స్ పఖ్వాడా కార్యక్రమాల సందర్భంగా అవగాహన ప్రచారం, వినియోగదారుల మొబైల్ ఫోన్లలో యాప్ ఇన్‌స్టాలేషన్ సహాయం, స్మార్టు మీటర్ల వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శనలు, సహాయక కేంద్రాల ఏర్పాటు, గ్రామ, మున్సిపల్ స్థాయిలో అవగాహన సమావేశాలు నిర్వహించబడతాయని ఆయన తెలిపారు. జిల్లా పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని స్మార్టు మీటర్ల వినియోగంపై అవగాహన పెంపొందించుకోవాలని,స్మార్టు మీటర్ అమరిక సమయంలో విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఎస్ ఈ విజ్ఞప్తి చేశారు.

# మారుతున్న సమీకరణలు

- లెక్కల కడుతున్న సీనియర్ నేతలు
- గెలుపే లక్ష్యంగా పథక రచన సర్పంచ్ అభ్యర్థి ఎన్నిక
- ముదిరాజు సామాజిక వర్గానికే అగ్రస్థానం




**విస్సన్నపేట,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో అత్యధిక ఓటు బ్యాంకు కలిగి బీసీ సామాజిక వర్గానికి చెందిన ముదిరాజు సామాజిక వర్గానికి కుటుంబం నుండి గ్రామ సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థిని ఎన్నిక చేయాలనే ఆలోచనతో ఒక రాజకీయ పార్టీ చాప కింద నీరులా పావులు కదుపుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం విస్సన్నపేట మండల కేంద్రంలో రాజకీయ సామాజిక ఆర్థిక అంశాలలో అందరికీ పరిచయం ఉన్న ముదిరాజు సామాజిక కుటుంబం నుండి సర్పంచ్ అభ్యర్థిని నిలిపేందుకు రంగంసిద్ధం చేస్తున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం అందుతుంది.

# నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి- డైట్ లెక్చరర్ అశోక్



**కృత్తివెన్ను,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక పై సమీక్ష లో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లెపాలెం నందు మంగళవారం డైట్ లెక్చరర్ అశోక్ అబ్జర్వర్ గా హాజరయి విద్యార్థులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా విద్యార్థుల యొక్క నోట్స్ లు మార్కులపై సమీక్ష చేసి పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించాలని కోరారు.ఈ కార్య క్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు టి వి వి ప్రసాదు కొప్పినీడి సూర్య ప్రకాష్ యేసు పాదం విజయ్ కుమార్ ప్రభ రేఖ దుర్గా జ్యోతి త్రివేణి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## రుద్రలింగేశ్వర స్వామి శివరాత్రి కళ్యాణానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కు ఆహ్వానం.



**ఎల్బీనగర్/వార్త ప్రభ (ఫిబ్రవరి 10)::**వెల్దండ మండలం గుండాల గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ అంబా రుద్రలింగేశ్వర స్వామి వారి శివాలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా జరిగే కళ్యాణ మహోత్సవానికి హాజరుకావాలని ఆలయ చైర్మన్, పూజారులు ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి అందజేశారు. ఈ కార్యక్రమంలో వెల్దండ మండలం ముఖ్య నాయకులు,భక్తులు,అభిమానులు పాల్గొన్నారు

## సృజనా సాధు ను ఘనంగా సన్మానించిన:ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.



**ఎల్బీనగర్/ వార్తప్రభ (ఫిబ్రవరి 10):**నాగోలు డివిజన్ వెంకటరమణ కాలనీకి చెందిన సృజనా సాధు 2026 ఎన్‌సిసి రిపబ్లిక్ డే క్యాంప్‌ను విజయవంతంగా పూర్తి చేసి తెలంగాణ రాష్ట్రానికి కీర్తి ప్రతిష్ఠ తీసుకొచ్చారు. వన్ తెలంగాణ బెటాలియన్ ఎన్‌సిసి నుంచి రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన ఆమెకు డైరెక్టరేట్ జనరల్ కమండేషన్ అవార్డు, మాస్టర్ ఆఫ్ సెరిమనీస్ మెడల్ లభించాయి. ఈ సందర్భంగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆమెను శాలువతో సన్మానించి అభినందించారు. సృజనా సాధించిన విజయాలు తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.

## జడ్పీ హైస్కూల్ లో విద్యార్థులచే మాక్ పార్లమెంట్

**పాల్గొన్న కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్**



**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి డివిజన్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సుభాష్ చంద్ర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ పార్లమెంట్ కార్యక్రమానికి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్పీకర్, ప్రధానమంత్రి, రాష్ట్రపతి, మంత్రులు, పార్లమెంట్ సభ్యుల వేషధారణలో ఉత్సాహంగా నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన వీక్షించి అభినందించారు. విద్యార్థులకు పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధానం,చట్టాల రూపకల్పనపై అవగాహన పెంచేలా ఈ కార్యక్రమం ఎంతో ఉపయుక్తమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు,వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రూ.78.50 లక్షలతో సీసీ రోడ్లు, పార్క్ పనులకు శంకుస్థాపన చేసిన కార్పొరేటర్.

**ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి .**




**ఎల్బీనగర్/వార్తప్రభ ( ఫిబ్రవరి 10):**హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్ కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా ?68.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం, రూ.10 లక్షలతో పార్క్ అభివృద్ధి పనులకు కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కాలనీ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ దశలవారీగా రోడ్లు, డ్రైనేజ్, పార్కులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు, స్థానికులు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనుల పర్యవేక్షణ చేసిన ఎమ్మెల్యే రంగారెడ్డి.



**ఎల్బీనగర్/వార్తప్రభ (ఫిబ్రవరి10):** ఇబ్రహీం పట్నం ప్రజల ఆరోగ్య భద్రతకు కీలకంగా మారనున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి స్వయంగా పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించి, నిధుల కొరత ఉండదని, అవసరమైతే అదనపు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. పనులు వేగంగా, నాణ్యతతో పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రి పూర్తయితే పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ,నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అధికారులు చేయవలసిన పని, ప్రైవేటు వ్యక్తులు చేయటం ప్రమాదకరం

***దోమల నివారణ మందు అంటూ ప్రమాదకర రసాయనాలను స్ప్రే చేస్తున్నారు***

***.బిజెపి నేత గుండె గణేష్ ముదిరాజ్***



**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ):**ఎన్నికలు సమీపిస్తున్న వేళ కొందరు రాజకీయ నాయకులు ప్రజలను మభ్యపెట్టేందుకు దోమల నివారణ పేరుతో ప్రమాదకర రసాయనాలను పిచికారీ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మియాపూర్ డివిజన్ బీజేపీ సీనియర్ నాయకుడు గుండె గణేష్ ముదిరాజ్ తీవ్రంగా ఆరోపించారు. ఇన్నాళ్లూ ప్రజల సమస్యలను పట్టించుకోని అవకాశవాద నాయకులు ఇప్పుడు ఒక్కసారిగా ప్రజాసేవకుల ముసుగు ధరించి మక్త మహబూబ్‌పేట్ పరిధిలో అనుమతి లేని,అనుమానాస్పద రసాయనాలను పిచికారీ చేస్తున్నారని విమర్శించారు.ప్రజల ఆరోగ్య భద్రత చూసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు ఈ వ్యవహారంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.బయటి వ్యక్తులు నకిలీ రసాయనాలు పిచికారీ చేస్తుంటే నిరోధించాల్సిన అధికారులు మౌనంగా ఉండటం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ రసాయనాల వల్ల ప్రజలకు ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే బాధ్యత ఎవరిదని ప్రశ్నించిన ఆయన ,రకరకాల రసాయనాల పిచికారీ వల్ల ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వ అధికారులు చేయాల్సిన పనులను ప్రైవేట్ వ్యక్తులు చేయడాన్ని సహించబోమని స్పష్టం చేసిన గుండె గణేష్ ముదిరాజ్,ఈ వ్యవహారంపై తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజల తరఫున డిమాండ్ చేశారు.

## ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించండి




**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ):**మియాపూర్ సర్కిల్--48 పరిధిలో ఆస్తి పన్ను మరియు వాణిజ్య లైసెన్స్ ఫీజు వసూళ్లను మరింత మెరుగుపరచడం,టీ.జీ.ఎస్.పీ.డీ.సీ.ఎల్ సవరణలు,జి.ఐ.ఎస్ వినియోగ మార్పులు,మీసేవా దరఖాస్తుల క్లియరెన్స్ అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అడిషనల్ మున్సిపల్ కమిషనర్లు (ఏఎంసీ లు), ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు (టీఐ లు) మరియు బిల్ కలెక్టర్లు (బీసీ లు) పాల్గొని ప్రస్తుత వసూళ్ల స్థితిగతులపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను, వాణిజ్య లైసెన్స్ ఫీజుల వసూళ్లను వేగవంతం చేయాలని,అలాగే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా ప్రక్రియలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. టీ.జీ.ఎస్.పీ.డీ.స.ఎల్ సవరణల కారణంగా ఎదురవుతున్న సమస్యలను సమీక్షించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిఐఎస్ వినియోగ మార్పుల ద్వారా ఆస్తుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి పన్ను లీకేజీ లేకుండా చూడాలని,ఈ ప్రక్రియలో సిబ్బంది సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. అలాగే మీసేవా ద్వారా వచ్చే వివిధ దరఖాస్తులు పెండింగ్ కాకుండా నిర్దిష్ట గడువులో క్లియర్ చేయాలని,ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి అర్హులైన వారికి వెంటనే సేవలు అందించాలని సూచించారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు తక్షణమే స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని,రెవెన్యూ వసూళ్లతో పాటు సేవల నాణ్యత పెంపే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఈ సమావేశంలో స్పష్టం చేశారు.

## ప్రజా సంక్షేమం, నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా సాగుతున్నా

**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన శాసనసభ్యులు**

**అరికెపూడి గాంధీ పాల్గొన్న కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్**





**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ):**హాఫిజ్ పేట్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో రూ.8 కోట్ల 32 లక్షల 80 వేల రూపాయలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణం,అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడి),వరద నీటి కాల్వలు,కమ్యూనిటీ హాల్,ఓపెన్ జిమ్ ఏర్పాటుకు పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పిఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ,ప్రజల సంక్షేమం,శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో,మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని అన్నారు. అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో,జాప్యం లేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కమ్యూనిటీ హాల్, ఓపెన్ జిమ్‌లు కాలనీ వాసులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు,కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### చిన్నజీయర్ స్వామి వ్యాఖ్యలపై వెల్లువెత్తిన అభ్యంతరాలు

# వివరణ కోరిన గోగులపాటి కృష్ణమోహన్

- ఆదిశంకరాచార్యుల చరిత్రను వక్రీకరించడం తగదు: సీనియర్ జర్నలిస్ట్ ఆగ్రహం
- శైవ-వైష్ణవ విభేదాలు రెచ్చగొట్టేలా మాట్లాడటం ఆచార్యులకు శ్రేయస్కరం కాదు
- చారిత్రక సత్యాలపై స్పష్టత ఇవ్వాలి లేదా క్షమాపణ చెప్పాలని డిమాండ్



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 10, (వార్తాప్రభ) :** ఇటీవల ముచింతల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో చిన్నజీయర్ స్వామి ఆదిశంకరాచార్యుల గురించి మరియు చతురామ్నాయ పీఠాల గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఆధ్యాత్మిక వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. స్వామివారి వ్యాఖ్యలు భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాలను, శాస్త్రసమ్మత చరిత్రను వక్రీకరించేలా ఉన్నాయని సీనియర్ జర్నలిస్ట్ గోగులపాటి కృష్ణమోహన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

**చారిత్రక వక్రీకరణపై ధ్వజం** ఆదిశంకరాచార్యులను కేవలం "వైష్ణవుడు"గా పేర్కొనడం, చతురామ్నాయ పీఠాలను ఆయన స్థాపించలేదని అనడం చారిత్రక సత్యాలకు విరుద్ధమని కృష్ణమోహన్ పేర్కొన్నారు. ఆదిశంకరాచార్యులు స్మార్త సంప్రదాయానికి ఆధారస్తంభమని, ఆయన శైవ, వైష్ణవ, శాక్త, సౌర, గాణపత్య మార్గాలను సమన్వయపరిచి 'షణ్మత స్థాపన' చేశారని గుర్తు చేశారు. శాస్త్రాలు, పరంపరలు మరియు చారిత్రక ఆధారాల ప్రకారం చతురామ్నాయ పీఠాల స్థాపన శంకరాచార్యుల ద్వారానే జరిగిందని, దానిని తిరస్కరించడం ఆధ్యాత్మిక సమన్వయాన్ని దెబ్బతీయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు.

**విభేదాలు కాదు.. సమన్వయం కావాలి** గతంలో కూడా "శివుడు ఉన్నచోటే శ్మశానం" వంటి వ్యాఖ్యలు చేయడం ద్వారా జగద్గురు పరంపరను అపహాస్యం చేసే ప్రయత్నం జరిగిందని ఆయన విమర్శించారు. ఆధ్యాత్మిక ఆచార్యుల బాధ్యత సమాజంలో విభేదాలు రెచ్చగొట్టడం కాదు, శాస్త్రం మరియు సంప్రదాయాల మధ్య సౌహార్దాన్ని పెంపొందించడం అని స్పష్టం చేశారు. "భారతీయ ధర్మం బలం విభజనలో లేదు, సమన్వయంలో ఉందని. ఎంతటి ప్రభావం ఉన్న ఆచార్యులైనా శైవ-వైష్ణవ సంప్రదాయాల మధ్య చిచ్చు పెట్టేలా మాట్లాడటం తగదు" అని కృష్ణమోహన్ హితవు పలికారు.

**స్పష్టత ఇవ్వాలి లేదా క్షమాపణ కోరాలి** ఈ నేపథ్యంలో చిన్నజీయర్ స్వామి తాము చేసిన వ్యాఖ్యలపై వెంటనే స్పష్టత ఇవ్వాలని, లేదా బహిరంగంగా వివరణ ఇస్తూ క్షమాపణ ప్రకటించాలని కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు శాస్త్రసమ్మత ఆధారాలు లేకుండా మాట్లాడటం ఆధ్యాత్మిక చర్చల గంభీరతను తగ్గిస్తుందని, ఇది భవిష్యత్తులో ఆచార్యుల ప్రతిష్టకే భంగం కలిగిస్తుందని ఆయన హెచ్చరించారు.

## వెల్దండలో 34వ బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కు ఆహ్వానం



**ఎల్బీనగర్/వార్తప్రభ (ఫిబ్రవరి 10):**వెల్దండ మండల కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం 34వ వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని దేవాలయ కమిటీ సభ్యులు కల్వకుర్తిలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ని కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. బ్రహ్మోత్సవాలకు తప్పకుండా హాజరైన ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా కల్వకుర్తి, వెల్దండ పట్టణాలకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు..

# హైదరాబాద్

## డివిజన్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దిన కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి

- ఘనంగా సత్కరిస్తున్న కాలనీవాసులు



**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ):**స్థానిక సమస్యల పరిష్కారంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనలో చందానగర్ డివిజన్‌ను ఆదర్శంగా నిలిపిన కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి మరియు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డి దంపతులను సురక్ష ఎన్‌క్లేవ్ కాలనీ వాసులు ఘనంగా సన్మానించారు. గత ఐదేళుగా కాలనీలోని దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధి పనులు చేపట్టినందుకు కృతజ్ఞతగా కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రవి,జనరల్ సెక్రటరీ పోచయ్య,వైస్ ప్రెసిడెంట్ యుంగధర్ రెడ్డి,సంక్షేమ సంఘం ప్రతినిధులు,స్థానికులు పాల్గొన్నారు.

## 920 కోట్ల నిధులతో డివిజన్ ను అభివృద్ధి పరిచా.

- కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి



**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ):**గచ్చిబౌలి డివిజన్‌లో గత ఐదేళ్లుగా చేపట్టిన అభివృద్ధి పనుల్లో సుమారు 90 శాతం పూర్తయ్యాయని కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి తెలిపారు .గౌలిదొడ్డిలోని వార్డ్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్లు, డ్రైనేజీ, పార్కులు, స్ట్రీట్ లైట్స్ తదితర మౌలిక వసతుల అభివృద్ధికి రూ.920 కోట్లతో పనులు చేపట్టామని చెప్పారు. భవిష్యత్తులో కూడా డివిజన్ అభివృద్ధికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.

## వృధా అవుతున్న మంజీరా జల.... జీవధార.

***నదిని తలపిస్తున్న చెన్నాపురం రోడ్డు.***

***నీటి వృధాను అరికట్టాలని ప్రజల వేడుకోలు.***



**జవహర్ నగర్ ఫిబ్రవరి 10: (వార్తా ప్రభ)**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కీసర సర్కిల్ పరిధిలోని జిహెచ్‌ఎంసి జవహర్ నగర్ చెన్నాపురం చౌరస్తాలో మంగళవారం మంచినీటి పైప్ లైన్ లీక్ అయి భారీ ఎత్తున మంచినీరు వృధా అవుతున్నా పట్టించుకోని జలమండలి అధికారులు. ఈ సందర్భంగా చెన్నాపురం వాసులు మీడియాతో మాట్లాడుతూ మంజీరా నీరు భారీ ఎత్తున వృధా అవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. జవహర్ నగర్లో అసలేనీటి కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ నీటి సరఫరా మురికినీటి బోర్డు (హెచ్‌ఎం డబ్ల్యూ ఎస్ ఎస్ బి) అధికారులు నిర్లక్ష్యంతో అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. అసలే ఎండాకాలం సమీపిస్తుండగా దీనికి తోడు జవహర్ నగర్ లో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా వీటికి తోడు తాగడానికి గుక్కెడు మంచినీరు దొరకక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూలిగే నక్క మీద తాటిపండు పడ్డచందంగా నీటి కొరతతో ప్రజలు ఇబ్బంది పడుతుండగా అధికారుల నిర్లక్ష్యం వల్ల మంచినీరు వృధా గా పోవడం బాధాకరం. మంగళవారం చెన్నపురం చౌరస్తాలో మంజీరా పైప్లైన్ లీకై పెద్ద ఎత్తున నీరు వృధా కావడం ప్రజలకు తాగునీరు దొరకక ఇబ్బందులు పడుతుంటే అధికారుల అలసత్వం వల్ల నీరు వృధా పోవడం శోచనీయమని చెన్నాపురం ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి భవిష్యత్తులో నీటి వృధాను అరికట్టాలని శాశ్వత చర్యలు తీసుకొని మంజీరా నీరు వృధాగా పోకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని జవహర్ నగర్ ప్రజలు వేడుకుంటున్నారు.

# ఎడిటోరియల్

## జంతుకొవ్వు లేదన్న వాదన సరే.. ఈ రసాయనాల మాటేంటి?

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో వినియోగించిన రసాయన ఆయిల్ (నెయ్యి కాని నేపథ్యంలో..కల్తీ నెయ్యి అన్న మాట కంటే కూడా రసాయన ఆయిల్ అంటే బాగుంటుంది. తిరుమలకు వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సరఫరా అయిన 68.17 లక్షల కేజీల రసాయనాల ఆయిల్ ను టీటీడీకి సరఫరా చేశారు. ఇందులో నెయ్యి అనే పదార్థం కంటే కూడా బోలెడన్ని రసాయనాలతో నెయ్యి లాంటి రసాయన నెయ్యిని తయారు చేశారు. తిరుమల లడ్డూ కోసం ఈ తరహా దుర్మార్గ కెమికల్ ఆయిల్ ను పంపిన కంపెనీల్లో భోలేబాబా, వైష్ణవి డెయిరీ, మాల్ గంగా, ఏఆర్ డెయిరీలు ఉన్నాయి. తాము సరఫరా చేసిందంతా శుద్ధమైన నెయ్యిగా పేర్కొంటూ టీటీడీ నుంచి రూ.234.51 కోట్లను కొల్లగొట్టారు. రసాయన మిశ్రమంతో తయారుచేసిన లడ్డూ ప్రసాదాన్ని శ్రీవారికి ప్రసాదంగా పెట్టారు. ఇంతకూ ఈ రసాయన ఆయిల్ లో ఏమేం కలిపారు? అన్న విషయంలోకి వెళితే.. బయటకు వచ్చే వివరాల్ని చూస్తే షాక్ కు గురి కావాల్సిందే. కల్తీ నెయ్యితో తిరుమల లడ్డూ ప్రసాదాన్ని తయారుచేసిన ఉదంతంపై సిట్ విచారణలో పలు షాకింగ్ అంశాలు వెలుగు చూశాయి. తిరుమలకు నెయ్యి పేరుతో కెమికల్ కొండను ఆయిల్ రూపంలో సరఫరా చేసిన సంస్థలు చేసిన దుర్మార్గాల్ని గుర్తించారు తాము కొన్ని కెమికల్స్ గుట్టురట్టు కాకుండా ఉండేందుకు పామాలిన్. పామ్ కెర్నెల్ ఆయిల్, కొబ్బరినూనెలను కొన్నట్లుగా దొంగ ఇన్ వాయిస్ లనుక్రియేట్ చేవారు. భోలేబాబా డెయిరీకి సరఫరా చేసిన ఈ రసాయనాల వెయిట్ ఏకంగా 6.51 లక్షల కేజీలు ఉండటం చూస్తే.. ఈ దందా ఎంత భారీగా జరిగిందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. అధికారిక పత్రాల్లో తాము పామ్ కెర్నెల్ ఆయిల్, కొబ్బరినూనెల్ని కొన్నట్లుగా చెప్పినా.. సిట్ విచారణలో భాగంగా కంపెనీ ప్రాంగణంలో తనిఖీ చేయగా.. అక్కడ అలాంటివేమీ కనిపించకపోగా.. కొరియా నుంచి దిగుమతి చేసుకున్న మెనోగ్లిజరైడ్స్, ఎసిటిక్ యాసిడ్ ఎస్టర్ లాంటి రసాయనాలు లభించటం గమనార్హం. ఒక్క భోలేబాబా డెయిరీలోనూ కాదు.. మిగిలిన చోట్ల కూడా ఇలాంటి పరిస్థితే. లడ్డూ ప్రసాదంలో వినియోగించిన రసాయనాల జాబితాను చూస్తే.. కడుపు మండిపోవాల్సిందే. పామాయిల్, పామ్ కెర్నెల్ ఆయిల్, లాక్టిక్ యాసిడ్, లీనియర్ అల్కైల్ బెంజీన్ సల్ఫోనిక్ యాసిడ్ (సింపుల్ గా చెప్పాలంటే లబ్సా), ఎసిటిక్ యాసిడ్ ఎస్టర్ ఫుడ్ (గ్రేడ్, మోనోగ్లిజరైడ్స్, డైగ్లిజరైడ్స్ లు ఉన్నట్లుగా గుర్తించారు. ఈ రసాయనాలు మనిషికి చేసే చేటు అన్ని ఇన్ని కావు. ఎంతో పవిత్రమైన లడ్డూ ప్రసాదాన్ని అసలుసిసలు రసాయనాలతో తయారు చేసిన వారిని ఎలా శిక్షించాలి?

## ప్రజా ప్రగతి ట్రస్ట్, ఇండియా లిటరసీ ప్రాజెక్ట్ సంయుక్తంగా అంగన్వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక గొల్లపూడి పంచాయితీ హాలు నందు అంగన్ వాడీ టీచర్లు కు శిక్షణా తరగతులు నిర్వహించారు. ప్రిస్కూల్ కి సంబంధించిన పాఠాలు ఆటల రూపంలో ఏ విధంగా చేయాలో శిక్షణ ఇచ్చారు, అందుకోసం కావలసిన లోకల్ మరియు లో కాస్ట్ వస్తువుల సేకరణ గురించి ఒకరోజు పాటు అంగన్వాడీ టీచర్లకు శిక్షణ ఇవ్వటం జరిగింది.ఈ శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా ఇండియా లిటరసీ ప్రాజెక్ట్ సమన్వయ కర్తలు, చెంచు రామి రెడ్డి , సుబ్రమన్యం ప్రజా ప్రగతి ట్రస్ట్ నుండి పాల్గొన్నారు; ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం చాలా ఉపయోగకరం టీచర్లు అందరూ శ్రద్ధగా నేర్చుకుని తమ సెంటర్ నందు పిల్లలకు చెప్పాలని తద్వారా అంగన్వాడీ కేంద్రాలను మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. సూపర్వైజర్ హెలెన్ శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో నేర్పిస్తున్న ప్రతి ఆక్టివిటీ ని ప్రతి రోజు సెంటర్ లోని పిల్లలకు నేర్పించాలి అన్నారు, పిల్లలు మానసికంగా, శారీరకంగా ఎదగడానికి ఈ ఆటలు ఎంతగానో ఉపయోగపడతాయని, ఇటువంటి కార్యక్రమాలు సెంటర్ లలో నిర్వహించడం ద్వారా పిల్లల తల్లిదండ్రులు కూడా పిల్లలను ఉత్సాహంగా పంపిస్తారు అని అన్నారు.ఈ కార్యక్రమంలో సీడీపీఓ పి. భానుమతి, ట్రైనర్లు చెంచు రామిరెడ్డి, సుబ్రహ్మణ్యం మరియు ప్రజా ప్రగతి ట్రస్ట్ కమ్యూనిటీ ఆర్గనైజర్ కల్పన, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, సూపెర్వైసోర్ హెలెన్ గారు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## చనమోలు వెంకట్రావు సేవలు స్ఫూర్తిదాయకం

### తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో చనుమోలు జయంతి



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 10(వార్తా ప్రభ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి చనమోలు వెంకట్రావు 94వ జయంతిని మంగళవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లోని వెంకట్రావు విగ్రహమునకు పూలదండలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చనమోలు వెంకట్రావు సేవలు స్ఫూర్తిదాయకం అంటూ ఈ సందర్భంగా వెంకట్రావు మైలవరం నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని కొనియాడారు.ఇబ్రహీంపట్నం ఎంపీపీ పాలడుగు జోత్స్న, కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చిట్టిబాబు, శ్రీనివాస్, కౌన్సిలర్లు చనమోలునారాయణ, మైలా సైదులు, విఘ్నేశ్వర రావు,రావి ఫణి, ఇబ్రహీంపట్నం పిఏసిఎస్ చైర్మన్ కోయ నెహ్రూ, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు వెంకటరావు అభిమానులు సానుభూతిపరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నగరవాసులు మెచ్చే విధంగా సంప్రదాయ వధూ-వరుల జ్యువెలరీ ఎక్స్ పో - కేశినేని జానకి లక్ష్మీ

- వసుంధర డైమండ్ రూఫ్ ఎక్స్ పో ను ప్రారంభించిన ఎంపీ సతీమణి కేశినేని జానకి లక్ష్మీ
- పారంభోత్సవం లో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలి చైర్మన్ పీతల సుజాత, బొండా సుజాత హాజరు





**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరంలో లెమన్ ట్రీ ప్రీమియర్ హోటల్ లో మంగళవారం వసుంధర డైమండ్ రూఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంప్రదాయ వధూ-- వరుల జ్యువెలరీ ఎక్స్ పో ను ముఖ్యఅతిథులుగా హాజరైన విజయవాడ ఎంపీ సతీమణి కేశినేని జానకి లక్ష్మి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సతీమణి బొండా సుజాత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలి చైర్మన్ పీతల సుజాత లతో కలిసి జ్యోతి ప్రజ్వాలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఎక్స్ పో నిర్వహకులు ఈ ముగ్గురికి ఘన స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం అనంతరం ప్రత్యేక డిజైన్లతో ఆకర్షీణీయంగా తయారు చేసిన వివిధ రకాల బంగారు ఆభరణానలను, వజ్రాభరణాలను వారు ఆసక్తి గా తిలకించారు. నిర్వహకులు ఆ అభరణాల ప్రత్యేకతను వివరించారు. ఈ సందర్భంగా కేశినేని జానకీలక్ష్మీ మాట్లాడుతూ మహిళలకు బంగారు ఆభరణాలంటే ఎప్పుడూ ప్రత్యేకమైన ఇష్టం ఉంటుందన్నారు. కస్టమర్ల కు ఒకేచోట విభిన్న కలెక్షన్లను అందుబాటులో ఉండేలా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన నిర్వహకులకి అభినందనలు తెలిపారు.తనని ఈ కార్యక్రమానికి ఆహ్వానించటం చాలా సంతోషంగా వుందన్నారు. అమెరికాలో వసుంధర జ్యువెలరీ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను కూడా సందర్శించటం జరిగిందన్నారు. గత 29 ఏళ్లుగా వసుంధర వారు మంచి నాణ్యత గల నగల తయారీలో విశేష అనుభవంతో ప్రజల ఆదరణ పొందుతున్నారని.... ఇక్కడ ప్రదర్శించిన అన్ని నగలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు.అలాగే తనకి వ్యక్తిగతంగా ట్రెడిషనల్ నగలంటే చాలా ఇష్టమని తెలిపారు. ప్రస్తుతం తగ్గిపోతున్న సంప్రదాయ పద్ధతుల్లో ఉన్న నగల తయారీని వసుంధర వారు కొనసాగించడం అభినందనీయమన్నారు.. తెలంగాణలోని సాధారణ మహిళలు ధరించే సంప్రదాయ నగలు, పూసల గొలుసు వంటి ఆభరణాలను కూడా ఇక్కడ అందుబాటులో వుండటం చాలా ఆనందంగా వుందన్నారు.వసుంధర డైమండ్ రూఫ్స్ మేనేజింగ్ డైరెక్టర్ వసుంధర మాట్లాడుతూ తమ సంస్థ హైదరాబాద్‌లో ప్రారంభించి 29 సంవత్సరాలు పూర్తయిందని, కస్టమర్ల ఆదరణతో దినదినాభివృద్ధి చెందిందని, అపూర్వమైన డిజైన్లు, నాణ్యత, వినియోగదారుల సంతృప్తే తమ సంస్థకు ప్రత్యేక గుర్తింపని తెలిపారు. అలాగే కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమాల్లో భాగంగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వసుంధర డైమండ్ రూఫ్స్ విజయవాడ షో రూమ్ హెడ్ అట్లూరి మేఘన తెలిపారు.

# ఎస్.హెచ్ .జి మహిళల్లో ఆత్మవిశ్వాసం నింపుతున్న ఎన్.ఐ.ఆర్.డి, ఎఫ్.డి.డి.ఐ సంస్థల శిక్షణా కార్యక్రమం

- హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి లో కేశినేని ఫౌండేషన్ , ఎన్.ఐ.ఆర్.డి సంయుక్త ఆధ్వర్యంలో 2వ రోజు శిక్షణ
- ఫోటో ఫ్రేమ్ డిజైన్స్, మెటీరియల్ సెలక్షన్ గురించి, ఎల్.పోల్డర్ తయారీ పై శిక్షణ
- ఈ మేరకు ప్రకటన విడుదల చేసిన ఎంపీ కేశినేని శివనాథ్ కేశినేని ఫౌండేషన్ కార్యాలయం



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), కేశినేని ఫౌండేషన్ , ఎన్.ఐ.ఆర్.డి సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి.ప్రధాన కార్యాలయంలో హ్యాండ్ మేడ్ పేపర్ ప్రోడక్ట్స్ తయారీ పై నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందుతున్న ఎన్టీఆర్ జిల్లాకి చెందిన ఎస్.హెచ్.జి మహిళలు ఈ శిక్షణ ను సద్వినియోగ పర్చుకుంటున్నారు.ఫిబ్రవరి 9వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జరిగే ఈ శిక్షణా కార్యక్రమంలో రెండు రోజు మంగళవారం ఎన్.ఐ.ఆర్.డిలో హ్యాండ్ మేడ్ పేపర్ ప్రోడక్ట్స్ తయారీ పై ఎస్.హెచ్.జి మహిళలు పొందిన శిక్షణ వివరాలను తెలియజేస్తూ ఎంపీ కేశినేని శివనాథ్, కేశినేని ఫౌండేషన్ కార్యాలయం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది.హ్యాండ్ మేడ్ పేపర్ ఉత్పత్తుల తయారీకి సంబంధించి గాంధీ హ్యాండ్ మేడ్ పేపర్ యూనిట్ అధికారి జె.రవీంద్రరావు నేతృత్వంలో హ్యాండ్ మేడ్ పేపర్ ను ఉపయోగించి పేపర్ బాగ్స్, ఫోటో ఫ్రేమ్ ఏ విధంగా తయారు చేయాలి...ఫోటో ఫ్రేమ్ డిజైన్స్, పేపర్ బాగ్స్ తయారీ కి మెటీరియల్ సెలక్షన్ గురించి, ఎల్.పోల్డర్ తయారీ పై, ఫైల్ తయారీ కోసం కొలతలు ఏ విధంగా తీసుకోవాలి, ఫైల్స్ డిజైన్ ఎలా వుండాలి...హ్యాండ్ ఆన్ పోల్డర్ గురించి అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం వీటిని ఎలా తయారు చేయాలో శిక్షణ ఇచ్చారు.

# డ్రోన్ సర్వేలెన్సు - సమస్యలకు సులభమైన పరిష్కారం



విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**డ్రోన్ సర్వే లైన్స్ తో సమస్యలను సులభంగా పరిష్కరించవచ్చు అని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా వేముల శ్యామలాదేవి రోడ్, ఏలూరు రోడ్డు, గుణదల, ఇన్నర్ రింగ్ రోడ్, 33 తూములు, ముస్తాబాద్ రోడ్డు ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.నగరంలోని సమస్యలకు సులభమైన పరిష్కారం డ్రోన్ సర్వేలెన్సు ద్వారా వస్తుందని ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణంలో అందించేందుకు 33 తూముల వద్ద పేరుకుపోయిన గుర్రపుడెక్కల వ్యర్థాలను డ్రోన్ ద్వారా పరిశీలించి, అబద్దాలను వీటిని తీసేయాలని తీసిన వ్యర్థాలను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. గుణదల మేరీ మాత ఉత్సవాలలో చివరి రోజున విజయవాడ నగరపాలక సంస్థ వారు చేసే ఏర్పాట్లలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని కమిషనర్ అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని, త్రాగునీరు, పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోటు లేకుండా చూసుకోవాలని. ఉత్సవాలకు వచ్చే మేరీ మత భక్తులకు విజయవాడ నగరపాలక సంస్థ వారు కల్పించే త్రాగునీటి సరఫరా లో ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని, అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ నిత్యం పారిశుధ్య నిర్వహణ పర్యవేక్షిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. ఇన్నర్ రింగ్ రోడ్ లో హరిత నీ పెంచాలని అన్నారు.తదుపరి అయోధ్య నగర్ అన్న క్యాంటీన్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అక్కడికొచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఇస్తూ, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేస్తూ, తాగునీటి, వాడుక నేటి సరఫరా లో ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకుంటూ ఉండాలనే అధికారులను ఆదేశించారు.

# అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి





**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విద్యార్థులు తమతమ రంగాలకు సంబంధించి జరిగే వర్క్‌షాప్‌లు ఇతర పరిశోధనలను సద్వినియోగం చేసుకొని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మైక్రోలింక్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీస్ సీఈవో వెలమల గోవిందరావు అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో 'బిల్డ్ స్మార్ట్ సిస్టమ్ ఏ హాండ్స్ ఆన్ ఎంబిడైడ్ సిస్టమ్‌స అంశంపై వారం రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ మంగళశారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రధానవక్తగా హాజరైన గోవిందరావు మాట్లాడుతూ విద్యార్థులు తమతమ రంగాల్లో వస్తున్న ఆధునాతన మార్పులను గమనించాలన్నారు. వాటిపై పట్టు సాధించాలన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా, పరిశ్రమల అవసరాలకు అనువైన మార్పులను తీర్చిదిద్దాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు వారివారి రంగాల్లో ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు చలవాది మల్లికార్జునరావు, చిట్టా అమర్‌సుధీర్‌లు పాల్గొని ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమాన్ని అధ్యాపకులు వీఎల్ సత్యనారాయణ, డీ విజయలక్ష్మీ తదితరులు నిర్వహించారు.

# ఎమ్మెల్యే సుజనా చౌదరికి అభినందనల వెల్లువ..



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** బిజెపి లెజిస్లేటివ్ పార్టీ సమావేశంలో నియోజకవర్గాల ర్యాంకింగ్ లో విజయవాడ వెస్ట్ బెస్ట్ కావడం పై పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.175 నియోజకవర్గాల్లో విజయవాడ వెస్ట్ టాప్ 1 లో నిలవడం ఎమ్మెల్యే సుజనా చౌదరి పనితీరు కారణంగానే అని కొనియాడిన సహచర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు .సుజనా చౌదరిని ఘనంగా సత్కరించిన బీజేపీ అధ్యక్షుడు మాధవ్, పార్టీ కి చెందిన ప్రజా ప్రతినిధులు.ఆయన్ని కొనియాడారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అన్ని విభాగాల్లో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం అత్యధిక మార్కులు తెచ్చుకోవడం అభినందనీయమన్న సహచర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.తదితరులు అభినందించారు.

# అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు ఖచ్చితంగా పాటించాలి





**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు ఖచ్చితంగా పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాలాద్రి అన్నారు. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం కొత్త ఆర్టీసీ బస్ స్టాండ్ వై స్క్రీన్ల ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.కొత్త ఆర్టీసీ బస్ స్టాండ్ వై స్క్రీన్ల ను క్షేత్రస్థాయిలో పరిశీలించి వారికి అగ్నిప్రమాదం జరగకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యల సామాగ్రి ఉందా లేదా అని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాటి వినియోగం తెలుసా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అగ్ని ప్రమాదం జరగకుండా తీసుకోవాల్సిన నివారణ జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించడమే కాకుండా వారిచే వారి పరికరాలను ఎలా ఉపయోగించాలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి అక్రిడేషన్ కార్డు-జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ.



**మచిలీపట్నం ఫిబ్రవరి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**అర్హులైన ప్రతీ ఒక్కరికీ అక్రిడిటేషన్ మంజూరు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్ లో వారి అధ్యక్షతన జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వ జీవో నెం. 84 లోని నిబంధనల ప్రకారం 308 మందికి అక్రిడిటేషన్లు మంజూరు చేశామన్నారు. ఇంకా అర్హత ఉన్న పాత్రికేయులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న వారికి, వివిధ కారణాలతో పెండింగ్లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి ఈనెల 24వ తేదీన జరిగే మూడో విడత సమావేశంలో అక్రిడిటేషన్లు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. అక్రిడిటేషనులు మంజూరు కానీ పాత్రికేయులు వారి అర్హతకు సంబంధించి ఆధార పత్రాలు, అనుబంధ పత్రాలు జతపరచి మరల సమర్పించిన యెడల పరిశీలించి అక్రిడిటేషనులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులుగా ఉన్న వివిధ జర్నలిస్టు సంఘాల సభ్యులు, మీడియా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# నంది అవార్డు గ్రహీత చిన మాస్టారుకు సన్మానం....



**గుడ్లవల్లేరు:ఫిబ్రవరి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మండల కేంద్రంలోని శ్రీసాయి విద్యానికేతన్ అధినేత సింగంశెట్టి ఆదినారాయణ(చిన మాస్టారు) చేసిన సామాజిక సేవలకు గానూ హైదరాబాద్ రితిక ఫౌండేషన్ నంది అవార్డును అందించారు. మంగళవారం ఆయన్ను విద్యానికేతన్‌లోని ఉపాధ్యాయులు, విద్యార్థులు దుశ్శాలువాలతో సన్మానించి అభినందించారు.

# ఆలయాల్లో వరుస దుర్ఘటనలు - ప్రభుత్వ వైఫల్యమే

**● కూటమి ప్రభుత్వం 'హిందూ ద్రోహి' ● భక్తుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న చంద్రబాబు ● వరుస అపచారాలు అయినా నోరు మెదపని పవన్ కళ్యాణ్**

**మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ ధ్వజం**




తాడేపల్లి ఫిబ్రవరి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి) తాడేపల్లి లోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ కూటమి ప్రభుత్వంపై నిప్పులుచేరిగారు. శ్రీశైలంలో శివస్వాములపై లాఠీఛార్జ్ అమానుషమని లాఠీ చార్జ్ చేసిన ఏఎస్పీపై చర్యలు తీసుకోవాలని నైతిక బాధ్యతగా హోంమంత్రి అనిత రాజీనామా చేయాలని వెల్లంపల్లి శ్రీనివాస్ డిమాండ్ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఆలయాలను, భక్తుల భద్రతను పూర్తిగా గాలికి వదిలేసిందని మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ మండిపడ్డారు. అధికారం చేపట్టిన తొలి ఏడాదే తిరుమలలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లలో విఫలమైన చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఆరుగురు భక్తుల మృతి చెందగా, సింహాచలం చందనోత్సవంలో గోడ కూలి ఏడుగురు, కాశీబుగ్గ తొక్కిసలాటలో తొమ్మిది మంది మరణించారని గుర్తు చేశారు. తాజాగా మహాశివరాత్రి వేళ శ్రీశైలం మల్లన్న స్వామి దర్శనానికి వచ్చే భక్తులపై లాఠీఛార్జ్ చేయడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని ఆయన ధ్వజమెత్తారు. ఒకవైపు కనీస సౌకర్యాలు కల్పించడంలోనూ, ఆలయాల్లో జరుగుతున్న వరుస దుర్ఘటనలను నివారించడంలోనూ ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్ని దారుణాలు జరుగుతున్నా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎందుకు నోరెత్తడం లేదని నిలదీశారు. శ్రీశైలంలో శివస్వాములపై లాఠీచార్జ్ కి పాల్పడ్డ ఏఎస్పీపై చర్యలు తీసుకోవడంతో పాటు నైతిక బాధ్యతగా హోంమంత్రి అనిత రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇంకా ఏమన్నారంటే..

**కూటమి పాలనలో భద్రత కరువైన భక్తులు...**కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హిందూ దేవాలయాలకు వచ్చే భక్తులకు భద్రత లేకుండా పోతుంది. ఇప్పటికే పలుదఫాలుగా ఈ విషయం స్పష్టమైంది. శివరాత్రి పర్వదినాన వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది శివభక్తులు శ్రీశైలం వస్తారు. తిరుమల తర్వాత శ్రీశైలం పెద్ద దేవస్థానం కావడంతో భక్తులు రద్దీ కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. గతంలో కాలినడకన శైవ మాల ధరించి... శ్రీశైలం వచ్చే భక్తులకు 30-40 రోజుల వరకు దర్శనానికి అనుమతి ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని 7 రోజులకే పరిమితం చేసి భక్తులు కాలినడకన వెళ్లే అవకాశం లేకుండా చేసింది. వాస్తవానికి రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి మాత్రమే కాకుండా.. పక్కనే ఉన్న తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా కాలినడకన శ్రీశైలం దర్శనానికి వస్తారు. అలాంటి భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. వారికి సౌకర్యాలు కల్పించలేదు సరికదా. భక్తులపై పోలీసులతో లాఠీచార్జ్ చేయించడం అత్యంత దుర్మార్గం. భక్తులకు రక్షణ కల్పించాల్సిన ఏఎస్పీ స్థాయి అధికారి వారిపై లాఠీ ఝులిపించడం అమానుషం. చిన్న పిల్లలకు, దివ్యాంగులకు, మహిళలకు కనీస సౌకర్యాలు కల్పించలేదు. భక్తులకు మంచినీళ్ళు ఏర్పాటు చేయడంలో కూడా ప్రభుత్వం విఫలమైంది. నిత్యం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పై బురదజల్లే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హోంమంత్రి అనితలు దీనిపై ఏం సమాధానం చెబుతారు. తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను పూర్తిగా దెబ్బతీసిన చంద్రబాబు ప్రభుత్వం ఇప్పుడు శ్రీశైలం మల్లన్న దేవస్థానాన్ని కూడా భ్రష్టుపట్టించే పనిలో పడింది. అందులో భాగంగానే భక్తులకు కనీస సౌకర్యాలు, మంచినీళ్లు కూడా అందించలేని దుస్థితిలో ఉంది. మరోవైపు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా లక్షలాదిగా మాల ధారణతో మల్లన్నస్వామి దర్శనానికి వచ్చే భక్తులపై లాఠీలతో కొట్టి గాయపర్చడం ద్వారా ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు.

**అయ్యప్పలను అవమానించిన చరిత్ర చంద్రబాబుదే.** గతంలోనే అయ్యప్ప స్వామి మాలధారణ వల్లే మద్యం విక్రయాలు తగ్గిపోయాయంటూ ముఖ్యమంత్రి స్థానంలో ఉంటూ అయ్యప్ప స్వామి భక్తులను అవమానించేలా మాట్లాడిన ఘనత చంద్రబాబుది. అంటే ఆదాయం కోసం మాలధారణపైనా నీచమైన వ్యాఖ్యానాలు చేసిన మీరా హిందువు? ఇలాంటి దుర్మార్గమైన పనులా మీరు చేసేది? స్థానిక కూటమి ఎమ్మెల్యే కాంట్రాక్టర్ల దగ్గర కమిషన్ తీసుకోవడం మినహా భక్తులకు కల్పించిన సౌకర్యాలు శూన్యం. భక్తులు ఎండ బారిన పడకుండా కనీసం చలువ పందిళ్లు ఏర్పాటుతో పాటు, తాగునీటి సరఫరా, రోడ్లపై మ్యాట్ లు వంటివేవీ ఏర్పాటు చేయకపోవడం దారుణం. కనీసం తాగేందుకు నీళ్ళు ఇవ్వలేని అసమర్ధ ప్రభుత్వం.. ఆలయాన్ని నిర్వహించలేకపోతే మూసుకోవాలని మండిపడుతున్న భక్తుల శాపనార్థాలు కూడా ఈ ప్రభుత్వానికి కనిపించడం లేదు. మంత్రుల కోసం గంటల తరబడి చిన్న పిల్లలతో ఉన్న మహిళలను మానవత్వం లేకుండా దర్శనాలు నిలిపివేశారు. సామాన్య భక్తులను దేవుడికి దూరం చేస్తున్నారు.

**దర్శనానికి వస్తే - లాఠీ దెబ్బలా?** హోంమంత్రి అనితను సూటిగా ప్రశ్నిస్తున్నాను... మీడియా ముందు నీతులు చెప్పే మీరు... పవిత్రమైన దేవాలయ ప్రాంగణంలో భక్తుల మీద లాఠీఛార్జీ చేయడం ద్వారా మీ ఎస్పీ ఘోరమైన తప్పిదానికి పాల్పడ్డారు. దానికి బాధ్యతగా మిమ్మల్ని భర్తరఫ్ చేయాలని, లేని పక్షంలో జరిగిన దానికి మీరే నైతిక బాధ్యత వహిస్తూ మీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన శాఖ మీద కనీసం పట్టు, అవగాహన లేదు. గతంలో శైవమాల వేసుకుని కాలనడక ద్వారా వచ్చే భక్తులకు 30 రోజులకు పైగా దర్శనానికి అవకాశం కల్పిస్తే.. దాన్ని 7 రోజులకు కుదిస్తే భక్తుల రద్దీ పెరుగుతుందన్న సంగతి మీకు తెలియదా? తద్వారా భక్తుల రద్దీ పెరుగుతుందని ఎందుకు అంచనా వేయలేకపోయారు? వారికి కనీస సౌకర్యాలు కల్పించడంలో ఎందుకు విఫలమయ్యారని మండిపడ్డారు. పల్లకీ సేవ, కళ్యాణోత్సవంతో సహా పలు ప్రత్యేక సేవలను కూడా రద్దు చేసినా.. భక్తులకు మాత్రం దర్శనం కల్పించలేక పోవడం దారుణం. ఏఐ టెక్నాలజీ వాడుతున్నాం, సాంకేతిక పరిజ్ఞానంతో భక్తులకు అన్ని రకాలుగా సౌకర్యాలు కల్పిస్తున్నామని మీరు చెప్పిన పెద్ద మాటలు ఏమయ్యాయి? పోలీసు శాఖకు, రెవెన్యూ, దేవాదాయ శాఖ, అటవీ శాఖలకు మధ్య సమన్వయం లేకపోవడం వల్లే ఇలాంటి దుర్ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

**దైవదర్శనమంటే భయపడుతున్న భక్తులు..** రాష్ట్రంలో ఏదైనా పండగ వచ్చిందంటే చాలు.. తొక్కిసలాటలు, లాఠీఛార్జీ, భక్తుల మీద దాడులు భక్తులు మృతి కూటమి ప్రభుత్వానికి ఆనవాయితీగా మారింది. గుడికి దర్శనానికి వెళ్లామంటే కూడా భక్తులు భయపడే పరిస్థితి వచ్చింది. ఇది కూటమి దిక్కుమాలిన ప్రభుత్వానికి నిదర్శనం. ఈ ప్రభుత్వం హిందూ ద్రోహి. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సహా కూటమి నేతలు హిందూ ద్రోహిగా మిలిపోవడం ఖాయం. ఇప్పటికైనా కూటమి పెద్దలు కళ్లు తెరిచి శివరాత్రి సందర్భంగా పట్టశీమ, కోటప్ప కొండతో పాటు రాష్ట్రంలో అన్ని శైవ క్షేత్రాల్లోనూ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేయాలని వెల్లంపల్లి శ్రీనివాస్ సూచించారు. శ్రీశైలంలో శివస్వాముల మీద దాడి చేసిన ఏఎస్పీ మీద చర్య తీసుకోవడంతో పాటు నైతిక బాధ్యతగా హోంమంత్రి అనిత రాజీనామా చేయాలని వెల్లంపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

## సైకోల ప్రవర్తిస్తున్న వైసీపీ పేటీఎం బ్యాచ్

**అక్కల గాంధీపై వ్యక్తిగత ఆరోపణలతో పైసాచికానందం**

**జనసేన పార్టీ నేతల ఆగ్రహం**



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 10 (వార్తా ప్రభ ప్రతినిధి):** వ్యక్తిగత దూషణలతో వైసీపీ పేటీఎం బ్యాచ్ పైశాచిక ఆనందం పొందుతుందని కొండపల్లి జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు చెరుకుమల్లి సురేష్ ఆరోపించారు. సోషల్ మీడియాలో జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల గాంధీపై వ్యక్తిగత దూషణ చేసిన వారిపై జనసేన పార్టీ నాయకులు మంగళవారం ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి వైసీపీ దుష్టశక్తుల మారిందని విమర్శించారు. వైసీపీ పేటీఎం బ్యాచ్ సైకోల్లా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి జోగి రమేష్ అగ్రిగోల్డ్, కల్తీ మద్యం వంటి అవినీతి మరకలను అంటించుకుంటే.. మచ్చలేని మనిషి అక్కల గాంధీ అన్నారు. ఇప్పటికైనా జోగి రమేష్ పద్ధతి మార్చుకోవాలని, లేనిపక్షంలో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత దూషణలు చేసిన వారిపై పోలీసులు చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మైలవరం మండల అధ్యక్షుడు శీలం బ్రహ్మయ్య, గొల్లపూడి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చెరుకుమల్లి రాధిక, కొండపల్లి మున్సిపల్ కో - ఆప్షన్ సభ్యుడు యర్రంశెట్టి నాని, వీర మహిళలు పాల్గొన్నారు.

## పేద విద్యార్థినికి ఫీజు సహాయం - మైత్రి ఫౌండేషన్



**మచిలీపట్నం ఫిబ్రవరి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సమాజ సేవలో ముందుండే మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద ప్రతిభావంతురాలైన విద్యార్థినికి విద్యా సహాయం అందించే కార్యక్రమంను మంగళవారం నిర్వహించారు. స్థానికంగా మచిలీపట్నం చింతగుంటపాలెం, తాలపూల వారి వీధికి చెందిన దినసరి కూలీ కుటుంబానికి చెందిన విద్యార్థిని చిరంజీవి మైనపు సత్య నాగ సాయి, పదవ తరగతిలో 566 మార్కులు, ఇంటర్మీడియట్‌లో 963 మార్కులు సాధించి తన ప్రతిభను చాటుకుంది. ప్రస్తుతం ఎస్ ఎస్ ఆర్ డిగ్రీ కాలేజీలో బీకాం (కంప్యూటర్స్) రెండవ సంవత్సరం ఫైనల్ సెమిస్టర్ చదువుతోంది. కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఫీజు చెల్లించడం కష్టంగా ఉండటంతో మైత్రి ఫౌండేషన్ ముందుకు వచ్చి సహాయం అందించింది. ఈ సందర్భంగా మొత్తం రూ. 21,000/- ఫీజును మైత్రి ఫౌండేషన్ తరఫున ఎస్ఎస్ఆర్ కాలేజీ యాజమాన్యానికి చెక్కు రూపంలో అందించారు. ఇందులో ఫౌండేషన్ గౌరవ సభ్యులు వల్లభనేని ఆంజనేయ ప్రసాద్ గారు రూ 5,000/- సహాయం అందించగా, మిగిలిన రూ 16,000/- ఫౌండేషన్ జనరల్ ఫండ్ నుండి చెల్లించారు. ఈ కార్యక్రమంలో మైత్రి ఫౌండేషన్ అధ్యక్షులు వేణు కుమార్ మాట్లాడుతూ, "పేద ప్రతిభావంతులైన విద్యార్థులకు చేయూత ఇవ్వడం అనేది కేవలం సహాయం మాత్రమే కాదు, సమాజ భవిష్యత్తును నిర్మించే పవిత్ర బాధ్యత అని అన్నారు. మైత్రి ఫౌండేషన్ ఎప్పటికీ విద్యాసేవ కార్యక్రమాలలో ముందుండి సేవలు అందిస్తుంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వరప్రసాద్, కార్యదర్శి రాధాకృష్ణ, సభ్యులు వల్లభనేని ఆంజనేయ ప్రసాద్, మాణిక్యాలరావు, జన్ను లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## రైజ్‌తో మహిళల ఆర్థిక సాధికారతకు పునాది

**- వన్ ఫ్యామిలీ - వన్ ఆంత్రప్రెన్యూర్ లక్ష్య సాధనకు కృషి - జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ**






**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 10(వార్తా ప్రభ ప్రతినిధి):** రూరల్ ఇంక్యుబేషన్ స్కిల్లింగ్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ (రైజ్) కేంద్రం ద్వారా మహిళల ఆర్థిక సాధికారతకు విశేషంగా తోడ్పాటు లభిస్తుందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలు స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగేందుకు రైజ్ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలోని రైజ్ కేంద్రాన్ని కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు నిర్వహిస్తున్న వివిధ శిక్షణ కార్యక్రమాలను పరిశీలించారు. మహిళలకు అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఉపాధి అవకాశాలు, మార్కెటింగ్ సహకారం వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న వన్ ఫ్యామిలీ -- వన్ ఆంత్రప్రెన్యూర్ సాధనలో రైజ్ కేంద్రం కీలకంగా నిలుస్తుందని తెలిపారు. మహిళలు రైజ్ కేంద్రంలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణ సదుపాయాలను పూర్తిగా వినియోగించుకుని స్వయం ఉపాధి కార్యక్రమాలు ప్రారంభించాలని సూచించారు. శిక్షణ పొందిన మహిళలు ఉత్పత్తి దశ నుంచి మార్కెటింగ్ దశ వరకు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని హామీ ఇచ్చారు. రైజ్ కేంద్రంలో జరుగుతున్న కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ చేపడుతూ, నాణ్యమైన శిక్షణ అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ.. ఆరోగ్యం.. సైకిళ్లతో సాధ్యం

**● బైకులు, కార్ల బదులు సైకిళ్ల వినియోగం పెరగాలి ● ఆరోగ్యంతో పాటు పర్యావరణాన్నీ కాపాడుకుందాం ● మంగినపూడి బీచ్ వద్ద సొంత ఖర్చులతో 10 సైకిళ్లు ఏర్పాటు చేస్తా ● మార్కెట్ యార్డు వద్ద ఈ సైకిళ్ల పంపిణీలో మంత్రి కొల్లు రవీంద్ర.**



**మచిలీపట్నం ఫిబ్రవరి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సైకిల్ వినియోగం ద్వారా పర్యావరణాన్ని కాపాడడంతో పాటుగా.. ఆరోగ్యాన్ని కూడా కాపాడుకునే వెసులుబాటు కలుగుతుందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నంలోని మార్కెట్ యార్డు వద్ద డ్వాక్రా మహిళలకు ఈ సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. చిన్నప్పటి సైకిల్ స్మృతులను గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సబ్సిడీతో ఎలక్ట్రిక్ సైకిళ్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. సైక్లింగ్ ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాలను అందరికీ తెలియజేస్తున్నాం. అభివృద్ధి చెందిన అనేక దేశాల్లో సైకిళ్ల వినియోగం భారీగా పెరుగుతోంది. సుమారు రూ.35 వేల విలువైన సైకిళ్లను రూ.24 వేలకే అందిస్తున్నారు. ప్రతి నెలా కొంత మొత్తం చెల్లించుకోవడం ద్వారా మన ఆరోగ్యంతో పాటు డబ్బు కూడా వృధా కాకుండా కాపాడుకునే అవకాశం లభిస్తోంది. మంగినపూడి బీచ్ లో 10 సైకిళ్లు కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. బీచ్ చూడ్డానికి వచ్చిన వారికి సైకిళ్లు అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రత్యేకంగా డ్వాక్రా మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యమంత్రి గారు హ్యాపీ ఆంధ్రప్రదేశ్ కావాలని ఆశిస్తున్నారు. మనం ఆరోగ్యంగా ఉంటేనే హ్యాపీగా ఉంటాం, హ్యాపీగా ఉంటేనే ఆదాయం వస్తది. ఆరోగ్యం పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనదే. చిన్న వయసులోనే అనారోగ్య సమస్యలు ఎదురవకుండా ఉండాలంటే వ్యాయామాన్ని నిత్య జీవనంలో అలవాటుగా చేసుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.

## రూ.8.12 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి.



**ఎల్బీనగర్/వార్తప్రభ ( ఫిబ్రవరి 10):** బి.ఎన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలో రూ.8.12 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు స్థానిక జీహెచ్ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి శంకుస్థాపనలు చేశారు. సచివాలయ నగర్, ఎన్జీవోస్ కాలనీల్లో రూ.693.25 లక్షలతో ఉమెన్స్ థీమ్ పార్క్ అభివృద్ధి, ఎన్జీవోస్ కాలనీలో రూ.72.30 లక్షలు, రంగారెడ్డి కాలనీలో రూ.46.50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నామని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థికి, మహిళకు మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ. 15 వేలు ఆర్థిక సహాయం



**రామచంద్రపురం ఫిబ్రవరి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** భర్తను కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఒక మహిళకు, చదువుకుంటూనే చిన్న వయసులోనే మ్యాజిక్ షో లు చేస్తూ ముందుకు సాగుతున్న విద్యార్థికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆర్థిక సహాయం అందించారు. వివరాల్లోకి వెళితే రామచంద్రపురం పట్టణంలోని 28 వ వార్డు చింతపల్లి నరసన్న నగర్ కు చెందిన అంగర కమల కుమారి అనే మహిళ తన భర్తను కోల్పోయి చిన్న పాపతో ఆర్థిక ఇబ్బందులు పడుతుంది. ఈ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న మంత్రి సుభాష్ రూ. 10 వేలు చెక్కు ను ఆర్థిక సహాయంగా అందించారు. అలాగే అదే వీధిలోని ఎస్ ఐ జి మున్సిపల్ హైస్కూల్లో ఎనిమిదవ తరగతి చదువుతూనే మ్యాజిక్ షో నేర్చుకుని తన నైపుణ్యంతో అలరిస్తున్న పేద విద్యార్థి యార్లగడ్డ మోహన్ సత్య దీప్ ప్రతిభను తెలుసుకున్న మంత్రి విద్యార్థి సత్యదీప్ ను ప్రోత్సహిస్తూ రూ.5 వేలు చెక్కును అందించారు. నిత్యం పేదవారికి, కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేస్తున్న మంత్రి సుభాష్ దయా గుణానికి, మానవత్వానికి పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శివరాత్రి స్నానాలకు పూర్తి ఏర్పాట్లు

**పవిత్ర సంగమంలో పారిశుధ్య పనులు పర్యవేక్షించిన మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు**



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 10(వార్తా ప్రభ ప్రతినిధి):** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం ఘాట్ వద్ద వేలాది మంది భక్తులు నదీ స్నానాలకు పూర్తి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు. మంగళవారం పవిత్ర సంగమం వద్ద పారిశుధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలకుండా పూర్తి ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆచరిస్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా శివరాత్రి సందర్భంగా కృష్ణా గోదావరి కలిసే పవిత్ర సంగమం ఘాట్ లో పవిత్ర నదీ స్నానాలు ఆచరించడానికి వేలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా మునిసిపాలిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అధికారులకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి మునిసిపాలిటీ కమిషనర్ వెంకటరత్నం, ఏఈ మౌస్మీ గనియా, కౌన్సిలర్లు చనుమోలు నారాయణ, ధరణికోట విజయలక్ష్మి, మునిసిపాలిటీ ప్రధాన కార్యదర్శి రావి మణిరాజ్, మైలా సైదులు, వల్లూరి జనార్ధన స్వామి దాసు తదితరులు పాల్గొన్నారు.

## కౌతవరంలో 13నుంచి జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు....



**గుడ్లవల్లేరు: ఫిబ్రవరి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మండలంలోని కౌతవరంలో జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఈ పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ మత్తి శివశంకర్ మంగళవారం తెలిపారు. ఈ నెల 13నుండి 15వ తేదీ వరకు కళ్ళేపల్లి వెంకట సుబ్బారావు, పింగళి బాల సుందరరావు మెమోరియల్ ఆల్ ఇండియా ఇన్విటేషన్ బాల్ బాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ పోటీలకు 8రాష్ట్రాల నుండి 17పురుషుల జట్లు తలపడనున్నాయని పేర్కొన్నారు. ఈ క్రీడా పోటీలు 3రోజుల పాటు స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిచబడతాయని చెప్పారు. ఈ క్రీడాకారులకు ఉచిత భోజన వసతి సదుపాయాలు గ్రామ పెద్దల సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని కృష్ణాజిల్లా అడిషనల్ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ బి.సత్యనారాయణ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వివరించారు. ఈ పోటీలు లీగ్ కం సూపర్ లీగ్ పద్ధతిలో నిర్వహిస్తామని ఈ పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ శివశంకర్ తెలిపారు.

## ఈరోజు సరూర్ నగర్ డివిజన్ పరిధిలో పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేత .

**- డివిజనల్ ఇంజనీర్ ఫర్హత్ అలీ.**



**ఎల్బీనగర్/వార్తప్రభ ( ఫిబ్రవరి 10) :** సరూర్‌నగర్ పరిధిలోని 11కేవి లైన్ నిర్వహణ పనుల కారణంగా రేపు వివిధ ప్రాంతాల్లో విద్యుత సరఫరా తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు డిఈ ఫరహత్ అలీ తెలిపారు .ఉదయం.10 - ఒంటి గంట వరకు భగత్ సింగ్ నగర్,శివాలయం; ఉదయం.11 - మధ్యాహ్నం.2 వరకు హనుమాన్ నగర్ ,రాక్ టౌన్,సాయి నగర్; మధ్యాహ్నం.2- సాయంత్రం.5 వరకు హుడా సాయినగర్,బ్యాంక్ కాలనీ (భగత్ సింగ్ నగర్) ఫీడర్ల పరిధిలోని పవర్ కట్ ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని డిఈ విజ్ఞప్తి చేశారు.





భారత కమ్యూనిస్టు పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్యని కలిసి అభినందనలు తెలిపిన అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర యూత్ జనరల్ సెక్రటరీ సూర్య యాదవ్ మరియు చిత్రంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పటాపంచల జమలయ్య యాదవ్,నారీ జలయ్య యాదవ్, వంగూరి శంకర్ యాదవ్ తదితరులు...వార్తా ప్రభ, విజయవాడ

## టీ స్టాల్‌లో చాయ్‌తో ప్రజల మనసులు గెలిచిన ఎమ్మెల్యే రంగారెడ్డి



**ఎల్బీనగర్/వార్తప్రభ (ఫిబ్రవరి 10):**ప్రోటోకాల్‌లు, హడావిడిని పక్కనపెట్టి రోడ్డు పక్క టీ స్టాల్‌లో చాయ్ తాగుతూ స్థానికులతో ఆత్మీయంగా ముచ్చటించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అందరి ప్రశంసలు పొందారు. ఆటో డ్రైవర్లు, కూలీలు, చిన్న వ్యాపారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని, అక్కడికక్కడే పరిష్కారాలపై హామీ ఇచ్చారు. ప్రజల మధ్యే ఉండే నాయకుడిగా ఎమ్మెల్యే రంగారెడ్డి మరోసారి నిరూపించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## ఇది తెలుగు జాతికి శ్రీకృష్ణ దేవరాయల మహోపకారం స్మరించుకునే మహోత్సవం

● శ్రీకాకుళంలో శ్రీకృష్ణ దేవరాయల వారి ఉత్సవాల్లో జస్టిస్ యూవీ దుర్గాప్రసాద్. ● ఆంధ్ర మహా విష్ణువు దేవస్థానంలో ఘనంగా ప్రారంభమైన శ్రీకృష్ణ దేవరాయ ఉత్సవాలు. ● రాయల వారి పేరు వింటే తెలుగు వారు పులకరిస్తారు : జస్టిస్ దుర్గాప్రసాద్. ● తెలుగు జాతి చరిత్ర శ్రీకాకుళం నుంచే ప్రారంభం : ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్.



**ఘంటసాల: అవనిగడ్డ: ఫిబ్రవరి 10(వార్తాప్రభ ప్రతినిధి)**ఇది తెలుగు జాతికి శ్రీకృష్ణ దేవరాయల మహోపకారం స్మరించుకునే మహోత్సవం అని రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, రాష్ట్ర ప్రభుత్వ హై పవర్ కమిటీ చైర్మన్ జస్టిస్ యూవీ దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఘంటసాల మండలంలో శ్రీకాకుళంలోని ఆంధ్ర మహావిష్ణు దేవాలయం ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ సహకారంతో దివి ఐతిహాసిక మండలి ఆధ్వర్యంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రత్యేక కృషితో రెండు రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన శ్రీకృష్ణ దేవరాయ మహోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జస్టిస్ యూవీ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రాయల వారి పేరు వింటే తెలుగు వారు పులకరిస్తారన్నారు. బహు భాషా కోవిదుడైన శ్రీకృష్ణ దేవరాయలు ఆంధ్ర మహా విష్ణువు స్వప్నంలో ఇచ్చిన ఆదేశాలతో తెలుగు భాషలో ఆముక్త మాల్యద ప్రబంధ కావ్య రచనను ఈ దేవస్థానంలో గావించటం, ఆ మహా కావ్యం పంచ మహా కావ్యాల్లో ఒకటిగా ఖ్యాతి పొందటం ఈ గ్రామ ప్రజలకు గర్వకారణం అన్నారు. తెలుగు భాష పరిరక్షణ ప్రతి తెలుగు వారి కర్తవ్యం కావాలని పిలుపునిచ్చారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తెలుగు జాతి చరిత్ర శ్రీకాకుళం నుంచే ప్రారంభమైందని, మొదటి ఆంధ్ర రాజులు శ్రీకాకుళం నుంచే పరిపాలన ప్రారంభించారని తెలిపారు. 1518 ఫిబ్రవరి 11న శ్రీకృష్ణ దేవరాయలు శ్రీకాకుళం వచ్చిన సందర్భంగా 2007నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో ఈ ఉత్సవాలను నిర్లక్ష్యం చేసినా, కూటమి ప్రభుత్వ సహకారంతో మళ్ళీ ప్రారంభించినట్లు తెలిపారు. బహు భాషా సామ్రాజ్య అధిపతి అయినప్పటికీ దేశ భాషలందు తెలుగు లెస్స అన్న ఆంధ్ర మహా విష్ణువు కలలో ఇచ్చిన ఆదేశాల ప్రకారం తెలుగులో ఆముక్త మాల్యద ప్రబంధ కావ్యం రచించటమే కాకుండా తన సామ్రాజ్యంలో తెలుగును పాలనా భాషగా చేసి గౌరవించిన గొప్ప రాజు శ్రీకృష్ణ దేవరాయలు అని తెలిపారు.

**వేటూరి సతీమణికి సన్మానం.**స్వర్గీయ వేటూరి సుందర రామమూర్తి సతీమణి వేటూరి మహాలక్ష్మమ్మకు జస్టిస్ దుర్గాప్రసాద్, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా వేటూరి సుందర రామమూర్తి రచించిన సిరికాకొలను సిన్నది నృత్య రూపకం అద్భుతంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి మహాశ్రీ, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ రేగుళ్ల మల్లికార్జున్, ఏఎంసీ చైర్మన్లు కొల్లూరి వెంకటేశ్వరరావు, తోట కనకదుర్గ, దోనేపూడి శివరామయ్య, మాజీ ఏఎంసీ మాజీ చైర్మన్ తుమ్మల చౌదరి బాబు, ప్రముఖ అవధాని పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, ప్రముఖ కవి గుడిసేవ విష్ణుప్రసాద్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, గ్రామ సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), నియోజకవర్గ కూటమి నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# డ్రైనేజ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం హయత్ నగర్:కార్పొరేటర్.





**ఎల్బీనగర్/వార్తప్రభ ( ఫిబ్రవరి 10)::**హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని మహేశ్వరి కాలనీ, పద్మాలయా కాలనీ, సూర్యనగర్ ఎక్స్‌టెన్షన్ మరియు బ్లడ్ బ్యాంక్ కాలనీల్లో భూగర్భ డ్రైనేజ్ పైప్‌లైన్ పనులకు కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించారు. సుమారు రూ.1.25 కోట్లకు పైగా నిధులతో చేపట్టిన ఈ పనుల ద్వారా వర్షాకాలంలో నీటి నిల్వ, మురుగు సమస్యలు, దుర్వాసన, దోమల బెడదకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

**సూర్య నగర్ కాలనీ అభివృద్ధికి వేగం – సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్ ప్రారంభం.** హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని సూర్య నగర్ కాలనీ ఫేజ్–1, ఫేజ్–2 ప్రాంతాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్‌ను కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ప్రారంభించారు. ఈ పనులతో కాలనీలో రాకపోకలు సులభతరం కాగా, సామాజిక కార్యక్రమాలకు శాశ్వత వేదిక అందుబాటులోకి వచ్చింది. ప్రజల అవసరాలే తన ప్రాధాన్యమని కార్పొరేటర్ పేర్కొన్నారు.

**మహేశ్వరి, పద్మాలయా, సూర్యనగర్ ఎక్స్‌టెన్షన్‌లో డ్రైనేజ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం.** హయత్‌నగర్ డివిజన్‌లోని మహేశ్వరి కాలనీ, పద్మాలయా కాలనీ, సూర్యనగర్ ఎక్స్‌టెన్షన్ కాలనీల్లో భూగర్భ డ్రైనేజ్ పైప్‌లైన్ పనులకు కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గారు శంకుస్థాపన చేశారు. దాదాపు 82 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన ఈ పనులతో వర్షాకాల సమస్యలు, దుర్వాసన, దోమల బెడదకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

**బ్లడ్ బ్యాంక్ కాలనీలో రూ.43.50 లక్షలతో భూగర్భ డ్రైనేజ్ పనులు ప్రారంభం.** బ్లడ్ బ్యాంక్ కాలనీలో ఎన్నాళ్లుగానో కొనసాగుతున్న మురుగు నీటి సమస్యల నివారణకు కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గారు దాదాపు రూ.43.50 లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజ్ పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. పనులు పూర్తయిన తర్వాత కాలనీ పూర్తిగా పరిశుభ్రంగా మారి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పై కార్యక్రమాలు సంక్షేమ సంఘ సభ్యులు, ప్రజాప్రతినిధులు, బిజెపి లీడర్లు, ప్రజలు ,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జీరో యాక్సిడెంట్ లక్ష్యంగా పనిచేస్తున్న పోలీసులు

● రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత ● ట్రాఫిక్ డిసిపి షేక్ షరీన్ బేగం
● ఇబ్రహీంపట్నంలో రోడ్డు ప్రమాదాల నివారణపై డ్రైవర్లకు అవగాహన





**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 10(వార్తా ప్రభ ప్రతినిధి):** జీరో యాక్సిడెంట్ లక్ష్యంగా పోలీసు వ్యవస్థ పని చేస్తుందని,రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలని తెలిపారు ఎన్టీఆర్ జిల్లా ట్రాఫిక్ డిసిపి షేక్ షరీన్ బేగం.మంగళవారం ఇబ్రహీంపట్నంలో రోడ్డు ప్రమాదాల నివారణపై స్థానిక డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా షరీన్ బేగం మాట్లాడుతూ ఇబ్రహీంపట్నంలో రోడ్డు ప్రమాదాల తీవ్రత ఎక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని నియంత్రించకపోతే ఒకప్పుడు చిలకలూరిపేట ను మ్యాపులో ఎలా గుర్తించేవారో ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ ను ప్రమాదాల కేంద్రంగా చెప్పుకుంటారని అన్నారు.కేంద్రంలో నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి, డీజీపీ, విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు రోడ్డు ప్రమాదల నివారణపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు.ఏ కుటుంబం కూడా ప్రమాదానికి గురవ్వకూడదని,కుటుంబ తమ సభ్యుడిని కోల్పోయి ఇబ్బంది పడకూడదని అన్నారు. ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ లో రోడ్డు ప్రమాదాలు చాలా వరకు నియంత్రించి మరణాలు 90 శాతం తగ్గాయని అన్నారు.పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు కృషితో పాటు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి ట్రాఫిక్ ను నియంత్రిస్తున్నమన్నారు.ఇబ్రహీంపట్నంలో అందరికీ చైతన్యం ఉందని,కాని బాధ్యత తగ్గిందని తెలిపారు.అన్ని చోట్లా రోడ్డు ప్రమాదాలు తగ్గి మరణాలు తగ్గుతుంటే ఇబ్రహీంపట్నంలో మాత్రం ఎందుకు తగ్గించేలేకపోతున్నాం అని స్థానిక డ్రైవర్లను ప్రశ్నించారు.ప్రమాదాలకు ముఖ్యకారణం మానవ తప్పిదాలు అని, త్రిబుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణం, అధిక వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా పెద్ద పెద్ద వాహనాల డ్రైవర్లు బాధ్యతగా ఉండాలన్నారు.నిబంధనలు,నిబద్ధత, బాధ్యత కలిగిన వారంతా చైతన్యవంతులై పోలీసులకు సహకరించాలని కోరారు.ఇబ్రహీంపట్నంలో 20 బ్లాక్ స్పాట్ లు ఉన్నాయి. మూడేళ్లు ప్రమాదం జరగకుండా ఉంటే బ్లాక్ స్పాట్ తీసేస్తారని.ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేస్తామని తెలిపారు. రింగు మరియు డివైడర్ల పునర్నిర్మాణంపై నేషనల్ హైవే అధికారులతో కలిసి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, కౌన్సిలర్ విజయలక్ష్మి, ఏ డి సి పి గుణ్ణం రామకృష్ణ, వెస్ట్ జోన్ ఏసిపి దుర్గారావు, ఆర్టీవో మూర్తి, ఇబ్రహీంపట్నం సీఐ చంద్రశేఖర్, ట్రాఫిక్ ఆర్ ఐ కృష్ణ, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీశైల క్షేత్రంలో భక్తులపై పోలీసుల దాడిని ఖండించిన - శ్రీశైల దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు గురుమహంతు మహేష్



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలి – గురుమహంతు మహేష్ డిమాండ్ చేశారు. శ్రీశైల పుణ్యక్షేత్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా, పవిత్ర దీక్షలో ఉన్న శివస్వాములపై పోలీసులు జరిపిన దాడిని తీవ్రంగా ఖండిస్తు మంగళవారం నాడు శ్రీశైల దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు గురుమహంతు మహేష్ ఓ ప్రకటన విడుదల చేసారు. ఈ సందర్భంగా గురుమహంతు మహేష్ మాట్లాడుతూ పరమశివుని సన్నిధిలో శివస్వాముల పట్ల భక్తుల పట్ల అమానుషంగా ప్రవర్తించడం అపచారమన్నారు. ఈ ఘటనపై దేవస్థాన పాలకమండలి నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు.

**ప్రధాన డిమాండ్లు:**ప్రోటోకాల్ దర్శనాల రద్దు చెయ్యాలి. సామాన్య భక్తులను గంటల తరబడి క్యూ లైన్లలో వేచి ఉండేలా చేస్తున్న బ్రేక్ మరియు ప్రోటోకాల్ దర్శనాలను తక్షణమే రద్దు చేయాలని. సామాన్య భక్తులకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మెరుగైన సౌకర్యాలు కల్పించాలని క్షేత్రానికి వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో దేవస్థానం విఫలమైందన్నారు. తక్షణమే వసతి, తాగునీరు మరియు క్యూ లైన్ల నిర్వహణను మెరుగుపరచాలన్నారు.సంప్రదాయాల పరిరక్షణ కు ప్రాధాన్యత ఇవ్వాలని ఆలయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బ్రహ్మోత్సవాల్లో వాహన సేవలను నిలుపుదల చేయడం అత్యంత హేయమైన చర్యమని. ఆగమ శాస్త్ర విరుద్ధమైన ఇలాంటి నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలన్నారు.గత అభివృద్ధిని స్మరిస్తూ.. గత ప్రభుత్వ హయాంలో శ్రీశైల క్షేత్రం ఎంతో అభివృద్ధి చెందిందని. మహాకుంభాభిషేకం నిర్వహణ, రాజగోపురాలకు బంగారు తాపడం, మాస్టర్ ప్లాన్ ద్వారా రోడ్ల వెడల్పు, శివ మాడ వీధుల నిర్మాణం మరియు ఆలయ ఉద్యోగులకు క్వార్టర్ల ఏర్పాటు వంటి పనులు భక్తుల సౌకర్యార్థం జరిగాయన్నారు. అప్పట్లో భక్తులకు ఉన్న ప్రాధాన్యత నేడు మృగ్యమవ్వడం శోచనీయమన్నారు.హిందూ ధర్మం మరియు భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరు మారకుంటే భవిష్యత్తులో భక్తుల పక్షాన పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

# చరిత్రకు అద్దం పట్టిన సిరికాకొలను సిన్నది నృత్య నాటిక.

*వర్ణ ఆర్ట్స్ అకాడమీ వారిచే సుప్రసిద్ధ నాట్యకారిణి స్మితా మాధవ్ ప్రధాన పాత్రలో అలరించిన నృత్య నాటిక.*



**ఘంటసాల: అవనిగడ్డ: ఫిబ్రవరి 10(వార్తాప్రభ ప్రతినిధి)** పరమాత్మ పట్ల భక్తిని కళాత్మక సౌందర్యాన్ని మాధుర్య భరితమైన భావాల మేళవింపుగా సిరికా కొలను సిన్నది నృత్య రూపకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. వేటూరి సుందర రామమూర్తి రచించిన ఈ సిరికాకొలను సిన్నది నృత్య రూపకాన్ని శ్రీకృష్ణ దేవరాయ ఉత్సవాల సందర్భంగా శ్రీకాకుళేశ్వర స్వామి వారి దేవస్థానంలో హైదరాబాద్ వర్ణ ఆర్ట్స్ అకాడమీ వారిచే, సుప్రసిద్ధ నాట్యకారిణి స్మితా మాధవ్ ప్రధాన పాత్రలో ప్రదర్శించి ఆద్యంతం కరతాళ ధ్వనులు అందుకున్నారు. జానపదం, చారిత్రకం, పౌరాణికాల సమాహారంగా ఈ ప్రదర్శన సాగింది. దేవాదాసీల భావోద్వేగాలకు అద్దం పట్టే ఈ నృత్య నాటిక ప్రేక్షకులను శ్రీకృష్ణ దేవరాయల వారి కాలానికి తీసుకువెళ్ళింది. శ్రీకృష్ణ దేవరాయలవారు శ్రీకాకుళం దేవస్థానంలో ఆముక్త మాల్యద గ్రంథ రచన చేసిన రోజుల్లో ఈ గ్రామంలో ఉన్న దేవదాసి కుటుంబంలో జన్మించిన అలివేణి అనే యువతి తాను దేవాదాసిగా మారేందుకు ఇష్టపడక, తాను శ్రీకృష్ణుడిని భర్తగా స్వీకరిస్తున్నట్లు ప్రకటించి, శ్రీకృష్ణుని ప్రతిరూపమైన ఆంధ్ర మహా విష్ణువును స్తుతిస్తూ శ్రీకాకుళేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామికి సేవలు చేసుకుంటూ ఉంటుంది. ఆమెను కపట బుద్ది కలిగిన మండలాధీశుడు మార్తాండ శర్మ శ్రీకృష్ణునిలా వచ్చి మోసం చేసి గర్భవతిని చేస్తాడు. మార్తాండ శర్మను శిక్షించటంతో నృత్య రూపకం ముగుస్తుంది. వేటూరి సుందర రామమూర్తి సుసంపన్నమైన కలం ద్వారా రూపుదిద్దుకున్న ఈ అద్భుతమైన నృత్యకళారూపకాన్ని స్మితా మాధవ్ తన బృందంతో రసరమ్యంగా, ఆద్యంతం ఆసక్తికరంగా ప్రదర్శించిన కళాకారులు ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. 1969లో వేటూరి సుందరరామమూర్తి రచించిన సిరికాకోలను సిన్నది నాటికను 1973లో ప్రఖ్యాత కళాకారులైన పెండ్యాల నాగేశ్వరరావు, వోలేటి వెంకటేశ్వరులు, కుమారి శ్రీరంగం గోపాలరత్నం, బాలంత్రపు రాజినికాంతరావు, కందుకూరి చిరంజీవిరావు తదితరులు కలిసి రేడియో సంగీత నాటికగా మలిచారు. స్మితా మాధవ్ ఈ నాటిక గురించి తొలిసారి, స్వర్గీయ కళాతపస్వి కె.విశ్వనాథ్ ద్వారా తెలుసుకునివేటూరితో స్నేహం, చిరకాల అద్వితీయ పరిచయంతో నృత్య నాటికగా మలిచి ప్రదర్శిస్తున్నారు. సంగీత సంపద, పదసౌందర్యంతో ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసిన ఈ నృత్య నాటిక ప్రదర్శన సంగీత మాధుర్యం, పాత్రల హృదయాల్లో దాగి ఉన్న సున్నితమైన భావోద్వేగాలు, వారి మధ్య నలిగే నైతిక సంక్లిష్టత ఆసక్తికరంగా ఉంటాయి. అలివేణి చెలికత్తెలు చంచల, జలజలుగా రాధిక, హంసిక, కుటిల రంగాజీగా భార్గవి, కపట మార్తాండ శర్మగా హరి, శ్రీకృష్ణ దేవరాయలుగా మెహెర్, కృష్ణుడుగా అదితి, అల్లసాని పెద్దన్న కవిగా శ్రేయ, గోపికలుగా ఇషి, విద్య, తుహిని, విట్టులుగా సాహితీ, సహన, విశాఖ, రాజిత, వైద్యునిగా హంసినీ, కృష్ణ పాత్రల్లో హర్షిత, అర్జున్, అభినవ్ నటించి మెప్పించారు. ప్రదర్శన అనంతరం జస్టిస్ యూవీ దుర్గాప్రసాద్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్, ఎంపీటీసీ తాడికొండ వేంకటేశ్వరరావు ఘనంగా సత్కరించారు.

# రూ.9.95 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేసిన కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి.



**ఎల్బీనగర్/వార్తప్రభ(ఫిబ్రవరి 10):**మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఌ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి శ్రీకారం చుట్టారు. వివిధ కాలనీల్లో సిసి రోడ్లు, స్టార్మ్ వాటర్ డ్రైన్లు, సీసీ కెమెరాలు, కమిటీ హాల్ సౌకర్యాలు, ప్రధాన రహదారి అభివృద్ధి వంటి పనులకు మొత్తం రూ.9 కోట్ల 95 లక్షల వ్యయంతో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ప్రజల మాటే పాలనగా, వాగ్దానాలు కాదు కార్యాచరణే తమ రాజకీయ గుర్తింపని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్సై వినయ్ ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ



**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ):**మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో అవినీతి బండారం బయటపడింది. కేసులో సహకారం అందిస్తానని చెప్పి ఫిర్యాదుదారుడి నుంచి రూ.50 వేల లంచం డిమాండ్ చేసిన సబ్ ఇన్‌స్పెక్టర్ వినయ్,అదే మొత్తాన్ని స్వీకరిస్తున్న సమయంలో ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు.ముందస్తు సమాచారం మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు,లంచం తీసుకుంటున్న క్షణంలో దాడి చేసి ఎస్ఐను అదుపులోకి తీసుకున్నారు.లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకుని వినయ్‌పై కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.ఈ ఘటనతో మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో తీవ్ర కలకలం రేగింది. ప్రభుత్వ ఉద్యోగులు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏసీబీ అధికారులు మరోసారి స్పష్టం చేశారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా వెలుగులోకి రావాల్సి ఉంది.

# ఎస్.బి.ఐ కాలనీలో స్వీపింగ్, డంపింగ్ సమస్యలపై తక్షణ చర్యలు.

*ఆర్కే పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత.*



**ఎల్బీనగర్/వార్తప్రభ (ఫిబ్రవరి 10):**మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ పరిధిలోని ఎస్. బి.ఐ కాలనీ, ప్రైవేట్ హౌసెస్ కాలనీల్లో మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా ఆర్.కే. పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత స్వీపింగ్,చెత్త డంపింగ్ సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా సానిటేషన్ డి.ఈ చందన, సానిటేషన్ ఇన్స్పెక్టర్ బుచ్చయ్య , సూపర్వైజర్ నరేష్ తో కలిసి రెండు కాలనీల్లోని సమస్యలను పరిశీలించి తక్షణ పరిష్కార చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రైవేట్ హౌసెస్ అధ్యక్షుడు బిక్షం రెడ్డి , ఎస్బిఐ కాలనీ అధ్యక్షుడు సుదర్శన్ , కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు..

# ఇబ్రహీంపట్నం కట్టమైసమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం.

*- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి.*





**ఎల్బీనగర్/ వార్తప్రభ ( ఫిబ్రవరి 10):**ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై జరుగుతున్న సుందరికరణ పనులను ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ కట్టమైసమ్మ తల్లి ఆలయం చుట్టూ పూర్తిగా రూపురేఖలు మార్చి, భక్తులకు నీటి వసతి కోసం బోర్‌తో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఆలయం పరిసరాలతో పాటు చెరువు చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

# నిత్యం శివలింగం నుంచి జలం... మూడు వర్ణాలుగా మారుతున్న శివలింగం

● శివలింగం నుండి పొలుసులు రావటం ● చరిత్రకు నిలువెత్తు సాక్ష్యం గుడి దిబ్బ శివాలయం




**కృత్తివెన్ను,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** నిత్యం... శివలింగం నుంచి జలం.... మూడు వర్ణాలుగా మారుతున్న శివలింగం... జిల్లావ్యాప్తంగా పేరుగాంచిన శివాలయం. అమృతాంజన్ కంపెనీలో షేర్స్ కలిగిన ఆలయం. దశాబ్దాల చరిత్రకు నిలువెత్తు సాక్ష్యం.ఎన్నో మహిమలు కలిగి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులతో పూజలు అందుకుంటున్న కృత్తివెన్ను లో వేంచేసి ఉన్న శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి వారి దేవస్థానం మహాశివరాత్రి ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతుంది. సుమారు 1000 సంవత్సరాల కిందట సప్త ఋషులలో ఆఖరివాడైన బదుగు మహర్షి కాలం నాటి ఆలయంగా ప్రసిద్ధి చెందినది. పూర్వం రెడ్డి రాజుల కాలంలో గుర్తు వెన్ను పరిధిలోని గుడి దిబ్బ ప్రాంతంలో ఈ ఆలయం ఉండేది. బంగాళాఖాతానికి ఉత్తర దిక్కున ఉన్న ఈ ఆలయం సమీపంలో కోనేరు ఉండేది. ఒక రోజున రెండు పశువులు కోనేరులో కొట్లాడుకుంటుండగా కోనేరులో నీరంతా ఎర్రగా మారిపోయింది. ఆ విషయాన్ని వెంటనే పశువుల కాపరులు అప్పటి జమీందారులైన రెడ్డి రాజులకు తెలుపుగా వారు పశువుల రక్తంగా భావించి మిన్నకుండి పోయారు. అదేరోజు రాత్రి స్వప్నంలో స్వామివారి రాజులకు సాక్షాత్కరించి కోనేరులో తన ప్రతిరూపం ఉందని, దానిని బయటకు తీసి ప్రతిష్టించాలని ఆదేశించినట్లు చరిత్ర చెబుతోంది. మరుసటి రోజు రాజులు కోనేరులో నీటిని తోడివేసి పరిశీలించగా స్పటిక ఆకారంలో స్వామివారి శివలింగం కనిపించినట్లు చరిత్ర చెబుతోంది. వెంటనే విగ్రహాన్ని వెలికి తీసి ఆలయాన్ని నిర్మించారు. రెడ్డి రాజుల అనంతరం ఆలయ వైభవం అంతరించిపోయింది. కాలగమనంలో ఆలయం శిథిల మైనట్లు చరిత్ర చెబుతోంది. తదనంతరం నాటి జమీందారులైన కాశీనాథ్ నాగేశ్వరరావు పంతులు ఈ ప్రాంతంలో భూములు కొనుగోలు నిమిత్తం రావటం, అప్పటికే శిథిలమైన ఆలయం గురించి ఆయన తెలుసుకున్నారు. ఆలయ ప్రాచుర్యాన్ని తెలుసుకొని ఆలయ పునర్నిర్మాణానికి అంకురార్పణ చేశారు. ఈ ఆలయంలో నిత్యం మూల విరాట్ కు ప్రత్యేకమైన మహిమలు కలవని భక్తుల విశ్వాసం,భూమి నుండి ఉద్భవించిన స్వయంభు శివలింగం స్పటిక ఆకారంలో ఉంటుంది. నిత్యం శివలింగం నుండి జలం ఉద్భవిస్తుంది. అలాగే శివలింగం నుంచి అమావాస్య, పౌర్ణమిలకు పాము కుబుసం మాదిరిగా పొలుసులు రావటం రావటం మరొక ప్రత్యేక విశేషం. నెలలో మూడు వర్ణాలుగా శివలింగం ప్రకాశిస్తుంది. పంచలింగాలుగా పిలవబడుతున్న వాటిలో ఈ స్వయంభూ శివలింగం ఒకటి.పశ్చిమ సింహద్వారం కలిగి అత్యధికంగా భక్తులతో పూజలు అందుకున్న స్వామివారి ఆలయాన్ని శివరాత్రి ఉత్సవాలకు సిద్ధం చేస్తున్నారు. ఈనెల 14వ తేదీ నుండి 18 వ తేదీ వరకు ఉత్సవాలు భారీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. 14న అంకురార్పణ మరియు విఘ్నేశ్వర పూజ, 15న స్వామివారి కళ్యాణం, 16న రాత్రి స్వామివారి తెప్పోత్సవం, 17న సాయంత్రం రథోత్సవం, 18న పవళింపు సేవలు, ఆలయ చైర్మన్ చేకూరి వెంకట్రావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కార్య నిర్వహణ అధికారి సింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో మాట్లాడుతూ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు తన అమృతాంజనం కంపెనీలో ఒక శాతం వాటా తో పాటు,66 ఎకరాల భూములు ఆలయానికి ఉన్నట్లు ఈవో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి, శివరాత్రి ఉత్సవాలను ప్రారంభిస్తారని తెలిపారు. పోలీసు వారి సహకారంతో వాహనాల రద్దీ లేకుండా తగు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లు, రాజగోపురం ఎదురుగా ఐరన్ షెడ్డు నిర్మాణం జరుగుతుం దన్నారు. ఆలయ చైర్మన్ చేకూరు వెంకట్రావు మాట్లాడుతూ మూడు రోజులు పాటు జరిగే ఈ ఉత్సవాలకు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా తగు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆలయం పక్కన ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రసాద వితరణ జరుగుతుందని పేర్కొన్నారు.

# బీసీ సంఘం సింహ గర్జనకు తరలిరండి..

## -బి సి వై పార్టీ గుడివాడ ప్రెసిడెంట్ బిక్షం యాదవ్

● భారత చైతన్య యువజన పార్టీ గుడివాడ శాఖ ఆధ్వర్యంలో బీసీ సంఘం సింహ గర్జన పోస్టర్ ఆవిష్కరణ..



**గుడివాడ,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్రరావు యాదవ్ ఆదేశాల మేరకు, భారత చైతన్య యువజన పార్టీ గుడివాడ శాఖ ఆధ్వర్యంలో బీసీ సంఘం సింహ గర్జన పోస్టర్ ను ఆవిష్కరించడం జరిగింది. గుడివాడ బీసీవై పార్టీ ప్రెసిడెంట్ బిక్షం యాదవ్ మాట్లాడుతూ బీసీ సింహ గర్జన ఈనెల 22వ తేదీన విజయవాడ -గుంటూరు నడుమ నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా పూలే అంబేద్కర్ ప్రాంగణం నందు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు.. బీసీ రక్షణ చట్టం అమలు చేయాలని రాజధాని ప్రాంతంలో బీసీలకు వెయ్యకరాల భూమి కేటాయించాలని తెలిపారు. సమగ్ర కులగణన, విద్యా ఉద్యోగాలు స్థానిక సంస్థలు చట్టసభల్లో బీసీలకు 44% రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. రాష్ట్ర మహిళ బీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ దారం నాగరాణి మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు కావస్తున్నా బిసి సంఘాలు అన్నీ కూడా అణిచివేతకు గురికాబడ్డాయని పేర్కొన్నారు. బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ బీసీల గురించి ఎంతో పాటుపడుతున్నారు. నవశకానికి నాంది పలుకుతూ నవ శంఖం పూరించిన నేత అని బీసీలంతా వారి అడుగుజాడల్లో నడుద్దామని తెలిపారు. బీసీలకు ఉన్న హక్కులన్నీ కూడావ ఇప్పుడు 27% మాత్రమే ఉన్నాయని తెలియజేశారు. బీసీలంతా కలిసి లక్షలాదిగా విచ్చేసి బీసీ సింహగర్జన సభను జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీవై పార్టీ నాయకులు పల్లపోతు రంగారావు, శివ కోటయ్య, అంజి తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడ 2వ టౌన్ పోలీసుల అధ్వర్యంలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు..

**గుడివాడ,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** స్థానిక 2 వ టౌన్ పరిధిలోని రైలుపేటలో ఉన్న వొకేషనల్ కాలేజ్ నందు గుడివాడ టూ టౌన్స్ పోలీస్ స్టేషన్ సీఐ జెఆర్కె హనీష్ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా శక్తి యాప్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై జాగ్రత్తలు, పోక్సో చట్టం తదితర అంశాలపై విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ హనీష్ మాట్లాడుతూ మహిళలు మరియు విద్యార్థులు ఎటువంటి ఆపద సమయంలోనైనా శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని, రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు ఎవరికి తెలియజేయకూడదని, మోసాలకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అలాగే పోక్సో చట్టం గురించి వివరించి, చిన్నారులు మరియు మైనర్ల భద్రతకు ఈ చట్టం ఎంతో



కీలకమని, ఎలాంటి దుర్వర్తన జరిగినా ఆలస్యం చేయకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు కూడా పాల్గొని శక్తి యాప్ డౌన్‌లోడ్ విధానం, వినియోగం, అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన చర్యలను విద్యార్థులకు ప్రత్యక్షంగా వివరించారు.

# ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో 14న జిల్లా స్థాయి 10కె, 6కె రన్ పోటీలు



**గుడివాడ,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** కీ॥శే॥ పర్వతనేని జగన్మోహన రావు వర్ధంతి సందర్భముగా ఈనెల 14వ తేదీన ఉదయం 6గం॥లకు పర్వతనేని జగన్మోహన రావు మెమోరియల్ ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి 10కె రన్ పురుషులకు, 6కె రన్ స్త్రీలకు మరియు 15 సం॥లలోపు బాల, బాలికలకు మరియు 4కె రన్ 12 సం॥లలోపు బాల, బాలికలకు వేరువేరుగా నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్ లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 కి.మీ. పరుగు పందెంలో పురు షులకు ప్రథమ బహుమతి గా సైకిల్, ద్వితీయ బహుమతిగా రూ.3,116/-, తృతీయ బహుమతిగా రూ.1,516/- నగదు బహుమతులు, 4 నుండి 15వ స్థానం పొందిన క్రీడాకారులకు ఒక్కొక్కరికి టీ-షర్టు బహుమతిగా ఇవ్వబడును. 6 కి.మీ. పరుగుపందెంలో స్త్రీలకు మరియు 15 సంవత్సరములలోపు (01-02-2014 ముందు జన్మించిన వారు) బాల, బాలికలకు ప్రథమ బహుమతిగా సైకిల్, ద్వితీయ బహుమతిగా రూ.3,116/, తృతీయ బహుమతిగా రూ.1,516/-, నగదు బహుమతులు, 4 నుండి 15వ స్థానం పొందిన క్రీడాకారులకు ఒక్కొక్కరికి టీ-షర్టు బహుమతిగా ఇవ్వబడును. 4 కి.మీ. పరుగుపందెంలో 12 సంవత్సరములలోపు (15-02-2014 ముందు జన్మించిన వారు బాల,బాలికలకు ప్రథమ బహుమతిగా సైకిల్, ద్వితీయ బహుమతిగా రూ.2,116-, తృతీయ బహుమతిగా రూ.1116/-, నగదు బహుమతులు, 4 నుండి 15వ స్థానం పొందిన క్రీడాకారులకు ఒక్కొక్కరికి టీ-షర్టు బహుమతిగా ఇవ్వబడును. ఈ 10 కి.మీ. / 6 కి.మీ. పరుగుపందెంలో పాల్గొనే స్త్రీ, పురుషులకు వయోపరిమితి లేదు. ఈ 10 కి.మీ. / 6 కి.మీ. మరియు 4 కి.మీ. పరుగులో పాల్గొనగోరు క్రీడాకారులు / క్రీడాకారిణులు ఫిబ్రవరి 9వ తేదీ సాయంత్రం నుండి 13వ తేదీ సాయంత్రం 05.00 గంటల వరకు ఎన్.టి.ఆర్. స్టేడియం ఆఫీసునందు వయసు నిర్ధారణ కొరకు ఆధార్ కార్డ్ కాపీ కాని జనన ధృవీకరణ పత్రము కాని ఇచ్చి తమ పేర్లను నమోదు చేసుకొనవలెను. ఎంట్రీతో పాటుగా తమ చెస్ట్ నంబర్లను పొందవలయును. 14వ తేదీన ఎంట్రీలు స్వీకరించబడవని యలవర్తి, కిలారపు లు తమ ప్రకటనలో తెలిపారు.

# ఆహార ధాన్యాల ఉత్పత్తి, నిల్వల్లో రైతులకు ప్రథమ శత్రువులు ఎలుకలు - డి ఎం ఎఫ్ విజయ కుమారి

● మైలవరంలో సామూహిక ఎలుకల నివారణపై రైతులకు అవగాహన సదస్సు




**మైలవరం,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** ఆహార ధాన్యాల ఉత్పత్తి మరియు నిల్వల్లో రైతులకు ప్రథమ శత్రువులు ఎలుకలు అని, ఎలుకలు వరి పంటను అన్ని దశలలో దెబ్బతీస్తాయని, వరి పంటలను కాపాడుకోవడా నికి సామూహిక ఎలుకల నివారణ ఒక్కటే మార్గమని ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ అధికారిణి డి ఎం ఎఫ్ విజయ కుమారి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మైలవరం పట్టణంలోని రైతు సేవాకేంద్రంలో స్థానిక మండల వ్యవసాయ అధికారి కె.సంధ్యారాణి ఆధ్వర్యం లో సామూహిక ఎలుకల నివారణపై మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సు కు జిల్లా వ్యవసాయ అధికారిణి డి ఎం ఎఫ్ విజయ కుమారి, మైలవరం సహాయ వ్యవసాయ సంచాలకులు యమ్. శ్రీనివాసరావు, మైలవరం పిఎసిఎస్ చైర్ పర్సన్ కరెడ్ల వెంకటనారాయణ విచ్చేశారు.ఈ సందర్భంగా విజయ కుమారి మాట్లాడుతూ విత్తినది మొదలుకొని కోత వరకు ఎలుకలు వరి పంటపై దాడిచేసి నష్టం కలిగిస్తాయనీ,చురుకైన పిలకదశ లో ఎలుకల వల్ల 0.5 శాతం నుంచి 60 శాతం వరకు అలాగే పంట కోత దశలో 5 నుంచి 10 శాతం నష్టం ఉంటుందని తెలిపారు.ఈ ఎలుకల నివారణకు రైతులందరు సామూహికం గా ఒకేసారి నిర్మూలన కార్యక్రమం చేపట్టాలని రైతులకు సూచించారు.ఎలుకల నివారణకు రాష్ట్రప్రభుత్వం 100 శాతం రాయితీపై బ్రొమోడయాలోన్ ఎలుకల మందును సరఫరా చేస్తుందని తెలియజేశారు.ఏ డి ఎ శ్రీనివాసరావు మాట్లాడుతూ.ఒక బొరియకు 10 గ్రాముల విషపు ఎర పొట్లాన్ని పెట్టాలని, 100 గ్రాముల విషపు ఎర తయారికి 2 గ్రాముల బ్రొమోడయాలోన్ మందు, 96 గ్రాముల నూకలు, 2 గ్రాముల నూనె అవసరం ఉందని తెలిపారు.పొలం కలిగి ఉన్న ప్రతి రైతు వారి స్మార్టు ఫోన్ లో ఏపిఎఐ యంఎస్-2.0 యాప్ ను ప్లేస్టోర్ ద్వారా డౌన్లోడ్ చేసుకుని వ్యవసాయ శాఖ సమాచారం పొందటంతో పాటు స్వంతంగా పంటనమోదు చేసుకునే మరియు నమోదు చేసిన పంట వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.పొలంకలిగిన ప్రతిరైతు విశిష్ట గుర్తింపు సంఖ్య (రైతు ఐడి)ను పొందవలసినది గా తెలిపారు.ఇంకా పొందని రైతు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ కి అనుసంధానమైన మొబైల్ నంబరుతో దగ్గరలో ఉన్న రైతు సేవాకేంద్రంలో సంప్రదించి పొందవచ్చు అని తెలిపారు.ఈ రైతు ఐడి ద్వారా పిఎం కిసాన్ ఆర్థికసాయం, పంటలభీమా ఇతర వ్యవసాయ పథకాలు పొందవచ్చని తెలిపారు. తయారు చేసిన విషపు ఎరను ఎలుక బొరియల లో పెట్టటం ఎలాగో రైతులకు క్షేత్ర స్థాయిలో చూపించారు.ఈ కార్యక్రమంలో వీఎఎ పవన్ శేఖర్ పాల్గొన్నారు.

# పెనుగంచిప్రోలు సర్పంచ్ కు షోకాజ్ నోటీసు




**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మేజర్ పంచాయతీ లో నిధుల దుర్వినియోగం కలకలం రేపింది. సుమారు ఒక కోటి 23 లక్షలు ప్రభుత్వ ధనం పక్క దారి పట్టినట్లు విచారణ లో తేలడం తో సర్పంచ్ పద్మ కుమారి కి డి పి ఓ షాకాజ్ నోటీసులు జారీ చేశారు, ఈ నోటీసులను పంచాయతీ కార్యదర్శి శ్యామ్ కుమార్ సోమవారం సాయంత్రం ఆమెకు అందజేశారు.విధుల వ్యయం పై 15 రోజులల్లో గా తగిన వివరణ ఇవ్వాలని అధికారులు ఆదేశించారు, వివరణ సంతృ ప్తి కరంగా లేని పక్షం లో తదుపరి చర్యలు తీసుకునే అవకాశం వుంది.

# ప్రాధాన్యత క్రమములో సమస్యల పరిష్కారం..

## -మున్సిపల్ కమీషనర్ మనోహార్



**గుడివాడ,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** ప్రజల అవసరాలను ప్రాధాన్యంగా తీసుకొని మౌలిక సదుపాయాల అభివృద్ధికి తగిన చర్యలు చేపడతామని మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ తెలిపారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డు పెదఎరుకపాడు ప్రాంతంలో మనోహర్ క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను ఆయన ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. పరిశీలన సందర్భంగా స్థానిక ప్రజలు శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని, అందుకు కంపౌండ్ వాల్ నిర్మాణం, ఫర్నెస్‌కు అవసరమైన ఎంఎస్ గ్రిల్ ఏర్పాటు చేయడం, అలాగే వర్షాకాలంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఇబ్బందులు లేకుండా రూఫ్ సదుపాయం కల్పించాలని కమిషనర్ ని కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్, శ్మశానవాటిక అభివృద్ధికి సంబంధించిన అంచనా వ్యయాలను వెంటనే సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ విభాగ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా చంద్రయ్య కాలువ గట్టు వద్ద కొత్త రోడ్డు మంజూరు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేయగా, 3 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణానికి సంబంధించిన అంచనాలను సిద్ధం చేయాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం, శానిటేషన్ మరియు పబ్లిక్ హెల్త్ విభాగాల అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 12 న దేశవ్యాప్త సమ్మె లో జయప్రదం చేయండి..

● సీనియర్ సీపీఐ నాయకులు వలం కొండ బ్రాహ్మం, ● సిపిఎం నాయకులు ధారా నాగేశ్వరరావు ల పిలుపు

**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** దేశ వ్యాప్తంగా లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ఆటో, ముఠా, హాకర్లకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని, భవనిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు కొనసాగిస్తూ జీవో జారీ చేయాలని, ప్రభుత్వ సంస్థల పరిరక్షణ కయి కోరుతూ ఫిబ్రవరి 12వ తేదీన జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని సీనియర్ సీపీఐ నాయకులు వలం కొండ బ్రాహ్మం, సిపిఎం నాయకులు దారా నాగేశ్వరరావు కార్మికులకు విజ్ఞప్తి చేశారు.. మంగళవారం పెనుగంచిప్రోలు లోని కర్ల లింగయ్య కళా భవన్ లో ( సీపీఐ కార్యాలయం ) ఫిబ్రవరి 12 న జరుగు దేశ వ్యాప్తంగా జరుగు సమ్మె వాల్ పోస్టర్ ను విడుదల చేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే విధంగా లేబర్ కోడ్స్ తీసుకువచ్చారని అన్నారు.కార్మికులకు సంఘం, పెట్టుకునే హక్కు సమ్మె చేసే హక్కు ,జీతాలు, కూలి పెంచమని కొట్లాడేటువంటి హక్కు లేకుండా 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లా మార్చారని అన్నారు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులు కొనసాగించాలని కోరారు, అంగన్వాడీ లకు, మధ్యాహ్న భోజనం వంట ఏజన్స్ ల కు ఆశ వర్కర్లకు ఇచ్చిన మాట ప్రభుత్వం నిల బెట్టుకోలేదని,ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు కేరళ ప్రభుత్వం వలె ఏర్పాటు చేయాలని, అధిక పెనాల్టీలు వేసే జీవో నెంబర్ 21 రద్దు చేయాలని, మహిళలకు ఫ్రీ బస్సు నేపద్యంలో ఆటో కార్మికుల ఆదుకోవాలని కోరుతూ ఈ సమ్మె జరగబో తుందన్నారు సమ్మె సందర్భంగా అన్ని పట్టణ మండల కేంద్రాల్లో జరిగే ర్యాలీలో సకల శ్రామికులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు..ఈ కార్యక్రమంలో మండల సీపీఐ కార్యదర్శి కనక పూడి బాబురావు, వ్యవసాయ కార్మిక నాయకులు కటారపు కన్నయ్య, ఎ ఐ టీ యూ సి నాయకులు జిల్లేపల్లి జిన్నా, పంద్ర కోల. రాంబాబు,గుజర్ల పూడి గోపి, రామకృష్ణ, సీపీ ఎం నాయకులు తురక కొండలు,కౌలు రైతు సంఘం నాయకులు వీ.గురవయ్య, ఎ ఐ టీ యూ సి, మరియు సిఐటియు.నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు...



# హైవే రోడ్డు పై బైకును డీ కొట్టిన ట్రాక్టర్

## జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న తల్లి, బిడ్డ



**పెనుగంచిప్రోలు,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండలం లోని కొనకంచి గ్రామ సమీపంలో జాతీయ రహదారి 65 మీద ట్రాక్టర్ బైక్ డీకొని ప్రమాదం ద్విచక్ర వాహనశీ మీద ప్రయాణిస్తున్న తెలంగాణకు చెందిన భార్యాభర్తలు, కుమార్తె బైక్ మీద నుంచి కింద పడిన మహిళా చేయి మీద నుండి వెళ్ళిన ట్రాక్టర్ మహిళా చేతి చర్మం పోయి తీవ్రగాయం,కాలు విరిగి తీవ్రంగా బాధపడుతున్న బాలిక ద్విచక్ర వాహనశీ నడుపుతున్న వాహనదారుడు సురక్షితం జగ్గయ్యపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు విషయం తెలిసిన పెనుగంచిప్రోలు ఎస్.ఐ. అర్జున్ సంఘటన స్థలం పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం..




**గుడ్లవల్లేరు,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని గుడ్లవల్లేరు ఎస్.ఐ ఎన్.వి.వి.సత్యనా రాయణ సూచించారు. మంగళవారం గుడ్లవల్లేరు మండల పరిషత్ పాఠశాలలో ఆయన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ అవగాహనను చేపట్టారు. విద్యార్థి దశ నుంచే చట్టాల పట్ల, సామాజిక అంశాల పట్ల అవగాహన కలిగి ఉండటం వల్ల ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవచ్చునన్నారు.

# మహిళలకు బ్యాటరీ సైకిల్ లు అందజేసిన ఎమ్మెల్యే బోడె

**కంకిపాడు/ పెనమలూరు,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో కాలుష్య నియంత్రణలో భాగంగా మోటారు సైకిళ్ల బదులుగా డ్వాక్రా సంఘాలకు బ్యాటరీ సైకిళ్ల పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. పెనమలూరు నియోజకవర్గం పోరంకి తెదేపా కార్యాలయంలో డ్వాక్రా సంఘాల మహిళలకు , వారి కుటుంబసభ్యులకు ఉపయోగపడేలా, కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో బ్యాటరీ సైకిళ్ల వినియోగం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని నియంత్రణలో భాగంగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ , 40 మంది డ్వాక్రా మహిళలకు బ్యాటరీ సైకిళ్లను అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంధన వాడకం



తగ్గించేలా కాలుష్య రహిత వాతావరణం కల్పించేల, ఆరోగ్యకరమైన వాతావరణం, వ్యాయామ సౌకర్యం పెంపొందించేలా ప్రజలకు, సమాజానికి ఉమ్మడి సౌకర్యం ఏర్పాటు ఉండేల, ఇంధన వినియోగ రూపంలో ప్రజలు వెచ్చిస్తున్న ఖర్చును తగ్గించేల, 40,000 విలువ చేసే, బ్యాటరీ సైకిళ్లను 24000 రూపాయలకే అందించేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బ్యాటరీ సైకిళ్ల వినియోగం అందుబాటులోకి తీసుకువస్తున్నామని, డ్వాక్రా మహిళలు కాకుండా ఇతరులకు ఎవరికైనా బ్యాటరీ సైకిళ్లు కావాలనుకుంటే 24000 రూపాయలే పూర్తి నగదు చెల్లింపు ద్వారా తక్షణ పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుటమ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధే లక్ష్యంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ దూకుడు పాలన

- కోటిపల్లి -ముక్తేశ్వరం రోడ్డు బ్రిడ్జి సాధనే లక్ష్యం
- మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడి





**రామచంద్రపురం,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** రామచంద్రపురం పట్టణ అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.2 కోట్ల 8 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్లు, సీసీ డ్రైనేజీ పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్. రాజు, డిఈ శ్రీకాంత్, కూటమి పార్టీ నాయకులు, ఆయా వార్డుల కౌన్సిలర్లు సమక్షంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 28వ వార్డులో రూ.15.55 లక్షలతో సిమెంట్ రోడ్డు, 20వ వార్డులో కేఎస్ఆర్ నగర్‌లో రూ.9.50 లక్షలతో సీసీ రోడ్డు, రూ.12.50 లక్షలతో సీసీ డ్రైనేజీ, రూ.15 లక్షలతో ప్రధాన సీసీ రోడ్డు, 19వ వార్డు కమ్మవారి సావరంలో రూ.15 లక్షలతో సిమెంట్ రోడ్డు, 13 మరియు 16వ వార్డులు శ్రీరామ్ నగర్‌లో జీసస్ ప్రేయర్ హౌస్ పక్కన రూ.16.30 లక్షలతో సీసీ రోడ్డు, అదే ప్రాంతంలో రూ.11.45 లక్షలతో సిమెంట్ రోడ్డు, 11వ వార్డులో రూ.32.48 లక్షలతో సిమెంట్ రోడ్డు, 4వ వార్డులో పాత గీతా థియేటర్ వద్ద రూ.7.74 లక్షలు మరియు రూ.13.57 లక్షలతో సీసీ రోడ్లు, 23వ వార్డులో మోడ్రన్ కళాశాల రోడ్డుకు రూ.39.95 లక్షలతో సీసీ రోడ్డు, 28వ వార్డులో చింతపల్లి సూరన్న నగర్‌లో రూ.19 లక్షలతో సిమెంట్ రోడ్డు పనులను మంత్రి ప్రారంభించారు. పలు వార్డుల్లో మొక్కలు నాటారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, జనరల్ ఫండ్స్ ద్వారా మొత్తం 12 అభివృద్ధి పనులు పూర్తి కావడం పట్ల మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు రూ.130 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ఇటీవల ఆదివారం పేట వద్ద రూ.5 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్, విద్యుత్ ఆధునికీకరణ పనులు ప్రారంభించడం ద్వారా 15 గ్రామాల్లో లో వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. రానున్న పుష్కరాల దృష్ట్యా మరో రూ.130 కోట్లతో అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేశామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ప్రకటించిన ర్యాంకుల్లో రామచంద్రపురం నియోజకవర్గానికి 11వ స్థానం దక్కడం గర్వకారణమని, ఈ విజయంలో కూటమి నాయకులు, అధికారులు, ప్రజల సహకారం అమూల్యమైందని మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్తులో కోటిపల్లి -ముక్తేశ్వరం రోడ్డు బ్రిడ్జి లక్ష్యంగా కృషి చేస్తానని మంత్రి సుభాష్ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ రాజు, డి ఈ శ్రీకాంత్, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవెల్లి శివ, గరికపాటి సూర్యనారాయణ, కొమరిన వీర్రాజు, కవలనానాజీ, దంగేటి గౌరీ శంకర్, జాస్తి విజయలక్ష్మి, బళ్ల లక్ష్మి, దొమ్మలపాటి విజయలక్ష్మి,నారపురెడ్డి బలరాం,గడి గోవిందు, అంకం శ్రీనివాస్, కొండేపూడి సురేష్, గుణ్ణం వినోద్, శ్రీహరి పంతులు, కొండ్రెడ్డి శీను, కూటమి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వడ్రంగి పని వారిని కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి



**అమలాపురం,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** రాష్ట్ర కార్పెంటర్ సంఘం ఆధ్వర్యంలో అమలాపురంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్పెంటర్ సంఘం రాష్ట్ర కన్వీనర్ అధ్యక్షులు దేవాదుల సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో కార్పెంటర్ల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక ప్రకటన విడుదల చేయాలని, కార్పెంటర్ సమస్యలపై మంత్రులు, ఎమ్మెల్యే లు అసెంబ్లీలో మాట్లాడాలని, భవన నిర్మాణ కార్పెంటర్లు గత ఐదు సంవత్సరాలుగా అనేక ఇబ్బందులు పడుతున్నారని, టింబర్ డిపోలో రెడీమేడ్ వేపకర్రతో గుమ్మాలు కిటికీలు అమ్ముతున్నారని, టింబర్ డిపోలో వారు రెడీమేడ్ తయారు చేసి అమ్మడం వలన వడ్రంగి కార్మికులు ఉపాధి కూలిపోతున్నారని, ప్రభుత్వం ఆంక్షలు పెట్టాలని,దీనిని వెంటనే నిషేధించాలని, చేతి వృత్తిదారులకి కార్పెంటర్లకు 50 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్ మంజూరు చేయాలని, కార్పెంటర్ కార్మికులు ప్రమాదాలకు గురి అయినప్పుడు కాళ్లు చేతులు పూర్తిస్థాయిలో ప్రమాదాలకు గురవుతున్నారు. వారికి ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీలో కార్పొరేట్ వైద్యం సదుపాయం కల్పించాలని,కూటమి ప్రభుత్వం ఎన్నికల్లోఇచ్చిన హామీలు నెరవేర్చాలని, రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు 50 లక్షల మంది ఉన్నారని, కార్పెంటర్ వృత్తిదారులు దీనస్థితిలో ఉన్నారని, కార్పొరేట్ వ్యవస్థ వల్ల పని లేక రోడ్డున పడ్డారని,కూటమి ప్రభుత్వం కార్పెంటర్ వృత్తిపై రాష్ట్ర ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేయాలని,గత తెలుగుదేశం ప్రభుత్వంలో కార్పెంటర్ కార్మికులకు ఇచ్చిన రాయితీలను ప్రవేశపెట్టాలని, ఐదు లక్షలు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని తదితర డిమాండ్లతో ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో గున్నేపల్లి భీమశంకరం, పితాని బేబీరావు, కుసుమే నరసింహరాజు, సాధనాల రామకృష్ణ, ముసుకురి ఏసుబాబు, కముజు సుందరరావు, కొప్పనాతి తాతాజీ, కేత సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కొంపల్లి మున్సిపల్ సర్కిల్ 56 లో చెలరేగుతున్న అక్రమ నిర్మాణాల 'మాఫియా'

- న్యూ స్టీల్ సిటీ, జయభేరి కాలనీల్లో నిబంధనలు 'బద్ధలు రాత్రికి రాత్రే షెడ్ల నిర్మాణం.
- మున్సిపల్ అధికారుల 'ముడుపుల' మౌనం? ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయ గండి.
- గంగస్థాన్ విల్లాస్ పక్కన, అశ్విని కాలనీ రోడ్ నెం. 5లో ఆగని అక్రమ కట్టడాలు.






రోడ్ నెంబర్ 5 అశ్విని కాలనీ శివాలయం రోడ్ కొంపల్లి






**కొంపల్లి,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** కొంపల్లి మున్సిపల్ సర్కిల్ 56 పరిధిలో ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పట్టణ ప్రణాళికా విభాగం అధికారుల కళ్లు గప్పి లేదా వారి పరోక్ష సహకారంతో భారీ షెడ్లు, బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



జయభేరి కాలనీ హనుమాన్ టెంపుల్ దగ్గర



గంగాస్తాన్ విల్లాస్ పక్కన దూలపల్లి మెయిన్ రోడ్డు

**ప్రధాన ప్రాంతాల్లో నిబంధనల ఉల్లంఘన..** ముఖ్యంగా దూలపల్లి మెయిన్ రోడ్డు, న్యూ స్టీల్ సిటీ కాలనీ, గంగాస్థాన్ విల్లాస్ పక్కన, మరియు అశ్విని కాలనీ రోడ్ నంబర్ 5 వంటి ప్రాంతాల్లో ఈ అక్రమ ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. జీహెచ్‌ఎంసీ చట్టం 1955 మరియు 'బిల్డ్ నౌ' నిబంధనల ప్రకారం ఎలాంటి అనుమతులు లేకుండానే ఇక్కడ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు.

**అధికారుల తీరుపై విమర్శలు..** అక్రమ నిర్మాణాలకు కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**చట్టం అమలులో వైఫల్యం:** సెక్షన్ 452, 461 ప్రకారం అక్రమ కట్టడాలను వెంటనే కూల్చివేసే అధికారం ఉన్నా, అధికారులు వాటిని అమలు చేయడం లేదు.

**ముడుపుల మత్తు :** నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా పనులు ఆగిపోకపోవడం వెనుక పెద్ద ఎత్తున 'మామూళ్ల' వ్యవహారం నడుస్తోందని విమర్శలు వస్తున్నాయి.

**సీలింగ్‌పై అనుమానాలు :** పగలు అధికారులు వచ్చి సీల్ వేయడం, రాత్రికి రాత్రే ఆ సీల్ మాయమై పనులు జరగడం గమనార్హం. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్న 'నాటకం' అని సామాజిక కార్యకర్తలు ఆరోపిస్తున్నారు.

**ప్రభుత్వ ఆదాయానికి గండి :** ఈ అక్రమ నిర్మాణాల వల్ల అటు మున్సిపాలిటీకి రావాల్సిన పన్నులు, ఇటు రిజిస్ట్రేషన్ ఫీజుల రూపంలో ప్రభుత్వానికి భారీగా ఆదాయ గండి పడుతోంది.

**బాధితుల డిమాండ్ :** తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి, విజిలెన్స్ విచారణ జరిపించాలని బాధితులు కోరుతున్నారు. అక్రమ కట్టడాలను కూల్చివేయడమే కాకుండా, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఏపీజెఎసి ఛైర్మన్ గా విద్యాసాగర్ ఏకగ్రీవ ఎన్నిక

- పిఆర్సి కమిటీ చైర్మన్ నియామకం వెంటనే జరగాలి
- ఉద్యోగుల డిమాండ్లు బకాయిలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలి
- ఉద్యోగులకు నష్టం కలిగించే ఏ నిబంధననూ అంగీకరించం
- 33 సంవత్సరాల సర్వీసు నిబంధన పాతదే... ఉద్యోగులు ఆందోళన చెందొద్దు
- పదవీ విరమణ ప్రయోజనాలు చెల్లింపుల్లో జాప్యాన్ని నివారించండి
- ఏపీ జేఏసీ చైర్మన్ ఎ.విద్యాసాగర్







**విజయవాడ,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చట్టబద్ధంగా లభించిన హక్కులు కోల్పోయే పరిస్థితి వచ్చినా, ఉద్యోగులకు నష్టం కలిగించే ఏ నిబంధననైనా ఎట్టిపరిస్థితుల్లో అంగీకరించబోమని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నామని, 33 సంవత్సరాల సర్వీసు నిబంధన పాతదేనని, ఈ విషయంలో వస్తున్న అవాస్తవ ప్రచారాల గురించి ఉద్యోగులు ఆందోళన చెందనవసరం లేదని, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి (ఏపీ జెఎసి) చైర్మన్ అలపర్తి విద్యాసాగర్, సెక్రటరీ జనరల్ కేఎస్ఎస్ ప్రసాద్‌లు అన్నారు. ఏపీ జేఏసీ కార్యవర్గ సమావేశం మంగళవారం గాంధీనగర్ లోని ఎన్జీజీవో హోం లో నిర్వహించి.. ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారంపై కార్యాచరణపై చర్చించారు. ఈ సమావేశంలో ఏపీ జెఎసి చైర్మన్గా శ్రీ ఏ విద్యాసాగర్ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఏపీ జెఎసి చైర్మన్, ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏ విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రధానంగా 2023 జూలై నెలలో నియమించాల్సిన వేతన సవరణ కమిటీ (పి.ఆర్.సి.) చైర్మన్ నియామకంలో జాప్యం జరగకుండా బుధవారం నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోపు కమిటీ నియామకంపై స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలన్నారు. 33 సంవత్సరాలు సర్వీస్ చేసిన వాళ్లు తప్పనిసరిగా రిటైర్ అవ్వాలని ప్రభుత్వం చెబుతున్న నిబంధన కొత్తది కాదని, గత నాలుగు దశాబ్దాలుగా ఆ నిబంధన అలాగే ఉందని, ఈ అంశంలో ప్రభుత్వ ఉద్యోగులు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. ప్రభుత్వం ఏ సవరణ చేయాలనుకున్నా ముందు ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చించిన తర్వాత వారి అంగీకారంతోనే నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. 20వ తారీకు లోపు సంఘాల అభ్యంతరాలను రాష్ట్ర ప్రభుత్వానికి చెప్తామని, వస్తువు కానీ ప్రచారాలను వదంతులను ఉద్యోగులు ఎవరు నమ్మవద్దని ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం ఎంత మాత్రం లేదని తెలిపారు. ప్రభుత్వం నవంబరులో ఆరు డిమాండ్లపై హామీ ఇవ్వడం జరిగిందని.. వీటిలో అయిదు డిమాండ్లకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడటం జరిగిందన్నారు. సిపిఎస్ విధానంలో ఉన్న ఉద్యోగులను నిబంధనల ప్రకారం ఓ పి ఎస్ లోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, గురుకుల పాఠశాల ఉద్యోగులకు కూడా 62 సంవత్సరాలకు పదవి విరమణ చేసే అవకాశాన్ని కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు బలహీన వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వర్తింపజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో పెన్షనర్లకు జరిగిన అన్యాయాన్ని చక్కదిద్దేందుకు ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలలో కార్యాచరణ ప్రకటించి వారికి న్యాయం చేయాలన్నారు. వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, ప్రమోషన్ల విషయంలో జరుగుతున్న నష్టాన్ని పూరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో అన్ని జిల్లాల జేఏసీ శాఖలను పునర్వ్యవస్థీకరిస్తున్నామని అన్ని మండల శాఖ లను పునర్వ్యవస్థీకరిస్తామన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వంలో ఉద్యోగులకు ఉన్న బకాయిలలో కొంతవరకు వరకు సాధించగలిగామన్నారు. ప్రభుత్వానికి ఉన్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వానికి సహకరిస్తున్నామన్నారు. అదేవిధంగా ప్రభుత్వం కూడా ప్రభుత్వ ఉద్యోగుల సహేతుకమైన డిమాండ్లను నెరవేర్చేందుకు ముందుకు రావాలన్నారు. ఈనెల 12వ తేదీన వివిధ కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె పిలుపుకు సంఘీభావంగా అఖిలభారత రాష్ట్ర ప్రభుత్వం జోగుల సమాఖ్య పిలుపుమేరకు రాష్ట్రంలోనే జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల నందు భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు చేపడతామని విద్యాసాగర్ తెలిపారు. ఏపీ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధి, జేఏసీ సెక్రటరీ జనరల్ కె ఎస్ ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ టీచర్లు 950 మంది వరకు మరణించారని.. వారి కుటుంబాలకు కారుణ్య నియామకంలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కరోనా సమయంలో శ్రీకాకుళం జిల్లాలో మరణించిన ఒక పంచాయతీరాజ్ టీచర్ కుటుంబానికి ఉపాధి కల్పించడంలో జాప్యాన్ని భరించలేక ఆ కుటుంబానికి చెందిన ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారన్నారు. కారుణ్య నియామకాలు భర్తీ చేసేందుకు ప్రతిబంధకాలుగా ఉన్న విధివిధానాలను సరళతరం చేసి 950 కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు లభించాల్సిన వైద్య సేవల అంశంలో గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ తీసుకొని ఇందుకు సంబంధించిన కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జేఏసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్ డీవీ రమణ, జేఏసీ నాయకులు ఎం.రఘునాథరెడ్డి (ఎస్‌టీయూ), జి.హృదయరాజు (ఏపీటీఎఫ్), బి.సాంబశివరావు (పబ్లిక్ సెక్టార్), వై.శ్రీనివాసరావు (ఎన్ఎంయూ), ఎన్.చంద్రశేఖర్ (నాలుగో తరగతి), బండి శ్రీనివాసరావు (పంచాయతీరాజ్ మినిస్టీరియల్), పీవీ సాయికుమార్ (అగ్రికల్చరల్ ఎంప్లాయీస్), పి.మధుకరబాబు (ట్రాన్స్‌పోర్ట్), బి.జానకి, ఎస్.విద్య, సి.ఎం.దాసు (సీపీఎస్ ఎంప్లాయీస్) జేఏసీ లోని వివిధ సంఘాల అధ్యక్ష కార్యదర్శులతో పాటు ఏపీ జెఎసి సెక్రటరీ జనరల్ డివి రమణ, కిలారు జగదీశ్వరరావు, ఎం. రఘునాథరెడ్డి, జి హృదయ రాజు, ఎన్. చంద్రశేఖర్ బండి శ్రీనివాసరావు, పివి సాయికుమార్, ఎస్. రాధమ్మ, బి. నరసింహులు, బి వెంకటేష్ బాబు, బి. జానకి, బి. సేవా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిఒక్కరికీ ఆర్థిక అక్షరాస్యత కీలకం

- సురక్షిత బ్యాంకింగ్‌పై అవగాహన పెంపొందించుకోవాలి
- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**విజయవాడ, ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** సరైన ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడంలో ఆర్థిక అక్షరాస్యత కీలకపాత్ర పోషిస్తుందని.. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా సురక్షిత బ్యాంకింగు విధానాలు, డిజిటల్ లావాదేవీలు, పొదుపు అలవాట్లపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో కలెక్టర్ లక్ష్మీశ వివిధ శాఖల అధికారులు, బ్యాం కుల ప్రతినిధులతో కలిసి ఆర్‌బీఐ – ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల (ఫిబ్రవరి 9 నుండి 13 వరకు)కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రజల్లో ఆర్థిక అంశాలపై అవగాహన పెంపొందించేందుకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక మోసాల నుంచి రక్షణ పొందేందుకు కూడా అవగాహన అవసరమన్నారు. ఈ నేపథ్యంలో వారోత్సవాల్లో భాగంగా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు బాధ్యతాయుత ఆర్థిక ప్రవర్తన, బ్యాంకింగ్ సేవలు, బీమా, పెన్షన్ పథకాలు, డిజిటల్ ఆర్థిక భద్రతపై వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం కె.ప్రియాంక, జీఎం డీఐసీ మధు, ఎస్‌బీఐ కోఆర్డినేటర్ జగదీష్, కెనరా బ్యాంక్ కోఆర్డినేటర్ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమ్మె నోటీసు ఇచ్చిన స్కీం వర్కర్స్



**గన్నవరం, ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** గన్నవరం మండలం లోని పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, నైట్ వాచ్ మెన్ లు, స్వీపర్ లు కనీస వేతనాలు, పని బద్రత, లేబర్ కోడ్ల రద్దు, తదితర కోర్కెలు సాధన కోసం జరిగే ఫిబ్రవరి 12 సమ్మె లో పాల్గొంటున్నామని మండల విద్యాశాఖ కార్యాలయం లో మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమం లో మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గండికోట సమ్మక్క, మల్లంపల్లి లలిత కుమారి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188